

306.94827
APP

Ci

306.94827
APP
P-11240
AUTHOR Appa Rao, M. R.

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

i

# HISTORY AND CULTURE OF THE ANDHRAS

By

**M. R. APPA RAO**
*Minister for Excise, Prohibition and Cultural Affairs.*

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11240

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D. P. R. I.
Acc. No. 11240

**Issued as supplement to the Budget Speech on Cultural Affairs**

*March, 1965.*

306.94827
APP

Printed at
The Andhra Pradesh Text Book Press
Mint Compound, Hyderabad.
1965

AOLA105B125

1

# ఆంధ్రులు : చరిత్ర, సంస్కృతి

## సంస్కృతి

'సంస్కృతి' అనే పదాన్ని నిర్వచించటం కష్టం. ఈ పదం ఒకజాతి, లేదా ఒకవ్యక్తి సాధించిన ప్రగతిని లేదా పొందిన సిద్ధిని తెలియజేస్తుంది. వినయశీలి, వివేకి, ఉదారుడు అనే అర్థాలలో 'సంస్కారవంతుడు' అనే పదాన్ని మనం ప్రయోగిస్తున్నాము. సంస్కారవంతుడు అల్పబుద్ధి కలవాడుగా ఉంటాడని భావించటం కష్టం. సంస్కారవంతుడు సాధారణంగా విద్యావంతుడై ఉంటాడు; కాని, ఒక్కొక్కప్పుడు నిరక్షరాస్యుడు కూడా గొప్ప సంస్కారం కలవాడు కావచ్చు—ఇందులకు మహా చక్రవర్తి అక్బరు తార్కాణం. ఒక సమాజము యొక్క సంస్కృతి, లేదా ఒక దేశము యొక్క సంస్కృతి, లేదా ఒక భాషా ప్రాంతము వారి సంస్కృతి అని మనం పేర్కొంటున్నప్పుడు ఆ సమాజం, లేదా ఆ దేశం, లేదా ఆ భాషాప్రాంతం సాధించిన ప్రగతిని గూర్చి మనం పేర్కొంటున్నామన్నమాట. ఇదే అర్థంలో ప్రాచీన గ్రీకు సంస్కృతి, ఆధునిక పాశ్చాత్య సంస్కృతి, భారతీయ సంస్కృతి అని పేర్కొంటున్నాము. కాని, ఒకవిధంగా ఆలోచిస్తే, సంస్కృతి అనేది భిన్న సమాజాలమధ్య, భిన్నదేశాల మధ్య భిన్నభిన్నంగా ఉండటానికి అవకాశంలేదు; ఎందుచేతనంటే మానవత్వం

వినయం, ఉదారత, నిస్స్వార్థ ప్రేమ అనేవి ఎల్లెడలా సమానాలే కాబట్టి. అయినప్పటికీ, సంస్కృతులను వేరుచేసి పేర్కొనటంలో మనం రెండో అర్థాన్ని తీసికొంటున్నాము. అంటే ఒక మానవసమాజం సామూహికంగా సాధించిన నైతిక, భౌతిక, కళాత్మక, వైజ్ఞానిక, మేధా, విద్యా ప్రగతి యొక్క స్థాయిని పురస్కరించుకొని, అది ఆ సమాజం యొక్క సంస్కృతి అని పేర్కొంటున్నాము. ఆ సమాజం లోని వ్యక్తులమధ్య సాన్నిహిత్యం—మానవజాతికి సంబంధించికాని, భాషకు సంబంధించికాని, భౌగోళిక స్థితికి సంబంధించికాని, చరిత్ర పరిణామానికి సంబంధించికాని, ఇంకేదేని కారణంవల్లకాని, పై వానిలో కొన్ని కారణాల వల్లకాని లేదా ఈ అన్నింటి కలయిక వల్లకాని—ఏర్పడి ఉండవచ్చు.

భారతీయ సంస్కృతి స్వచ్ఛమైన కాంతివంటిది; వ్యాకరించి చూస్తే అది బహుళవర్ణ సమాహారమని తెలియ గలదు. ఏ సంస్కృతి అయినా ఏ నాగరికత అయినా ఇంతే. విభిన్నాలైన మానవజాతుల, మతాల, భాషల, తదితరముల సమ్మేళనంవల్ల రూపొందని సంస్కృతికాని, నాగరకతకాని లేదనియే చెప్పవచ్చు. నిజానికి ఇతర దేశాలలో కంటె భారత దేశంలోనే ప్రపంచ సంస్కృతులలోని వివిధాంశాలు అధికంగా సమ్మేళనం పొందిఉన్నాయి. ప్రపంచంలోని ప్రముఖ మతాలన్నీ మన దేశంలో నెలకొని ఉన్నాయి. ప్రధాన భారతీయ భాషలతోపాటు ఆంగ్లభాష కూడా వ్యవహారంలో ఉంది. మన చిరకాల చరిత్ర పరిశీలించిచూస్తే అనేక విదేశీయ జాతులవారు మనలో కలిసిపోవటం గోచరిస్తుంది.

AOVAI05B125



మన సనాతన నాగరకత, మన ప్రాచీన చరిత్ర—ఇవి బలిష్ఠాలు కావటంవల్ల పలుదేశాల సంస్కృతులు మన జాతీయ సంస్కృతిలో లీనమై పోయాయి. మన విచిత్ర వాతావరణ పరిస్థితులు, భౌతిక స్థితిగతులు, దేశవైశాల్యం—ఇవి అన్నీ కలిసి మన జాతీయ సంస్కృతి బహుముఖంగా అభివృద్ధి పొందటానికి తోడ్పడ్డాయి. ఈ సందర్భంలో ఆంధ్ర సంస్కృతిని గూర్చి ప్రత్యేకంగా ప్రస్తావించటమంటే భారతీయ సంస్కృతిలోని ఒక ప్రత్యేకాంశాన్ని గూర్చి ప్రముఖంగా వివరించటం మాత్రమే అని అర్థంచేసికోవాలి.

## భాష

భాషను గూర్చి వివరించటంతో ఆరంభంచేస్తాను. తెలుగులో ఆర్య-ద్రావిడ భాషా-సారస్వతాల అంశాలు రెండూఉన్నాయి. వీటినే మార్గ-దేశీభేదాలంటారు. 'మార్గ' అనేది సంస్కృత జన్యం; కాగా ఆర్యసంబంధి. 'దేశి' అనేది దేశీయమైనది; కాగా ద్రావిడ సంబంధి. ఈ భాషాభివృద్ధిలో పై రెండు అంశాలు పెనవేసికొని ఉన్నాయనటానికి నిదర్శనం ఈ భాషకు రెండు పేర్లు ఉండటమే—ఒకటి ఆర్య సంబంధి పదమైన 'ఆంధ్రము'; ఇంకొకటి ద్రావిడ సంబంధి పదమైన 'తెలుగు'. తెలుగు "సంశ్లిష్ట భాష. ఇందులో ప్రాతిపదికకు విభక్తి చేరిస్తే చాలు. అసలు ప్రాతిపదికలో ఎట్టిమార్పు ఉండదు. సంస్కృత

ప్రాతిపదికలకు డు, ము, వు, లు అనే తెలుగు విభక్తులు చేరిస్తేచాలు, అవి తెలుగు పదాలైపోతాయి.

ఉదా :—

| సంస్కృతం | తెలుగు |
|---|---|
| రామ(ః) | రాముడు |
| వృక్ష(ః) | వృక్షము |
| రాహు(ః) | రాహువు |
| దంపతీ | దంపతులు |

—*నిడుదవోలు వేంకటరావు*

ఆంధ్రము లేదా తెలుగు అజంతభాష కావటంచేతా, శబ్దాలలోని మాధుర్యంవల్లా దీన్ని 'ప్రాగ్దేశపు ఇటలీ భాష' (Italian of the East) అంటారు. అంతేకాదు, గాత్ర సంగీతానికి ఈ భాష ఎంతో అనుకూలం. తమిళ దేశంలో, కన్నడ దేశంలో వ్యవహారంలోఉన్న శాస్త్రీయ కర్ణాటక సంగీత కృతులలో అధికభాగం తెలుగు భాషలోనే ఉండటం గమనార్హం. సంగీతధర్మమైన మాధుర్యగుణం కలిగిన దవటంచేతా, సంస్కృత పదాలను సులువుగా తనవిగా చేసికోగలశక్తి కలిగినదవటంచేతా ఆధునిక వైజ్ఞానిక భావా లను వ్యక్తం చేయటానికి భారతీయభాష లన్నింటిలోను తెలుగు భాషయే ఎక్కువ అనుకూలమైనదని పాశ్చాత్య విద్వాంసుడు ఆచార్య జె. బి. ఎస్. హాల్డేన్ పేర్కొన్న విషయం విజ్ఞులందరకూ తెలిసిందే.

## చరిత్ర

'ఆంధ్ర' అనే పదం ప్రప్రథమంగా ఐతరేయ బ్రాహ్మణంలో కనిపిస్తోంది. అశోకుని తరువాత ప్రసిద్ధికి వచ్చిన సాతవాహనుల లేదా శాలివాహనుల కాలం నుంచీ ఆంధ్రుల చరిత్ర క్రమప్రకారం తెలియవస్తోంది. నాలుగు శతాబ్దాలపాటు ఆంధ్రదేశాన్ని పరిపాలించిన సాతవాహనులు బౌద్ధులు. మంచి ఉచ్చదశలో ఉన్నప్పుడు ఈ ఆంధ్ర చక్రవర్తుల సామ్రాజ్యం దక్కను పీఠభూమి అంతా వ్యాపించటమే కాక కొంతవరకు ఉత్తర హిందూస్థానానికి, అధికంగా తమిళ దేశానికీ కూడా వ్యాపించింది. తొలి సాతవాహన చక్రవర్తి అయిన శ్రీముఖ సాతవాహనుడు నేటి గుంటూరు జిల్లాలోని అమరావతి రాజధానిగా క్రీ.పూ. 225 నుంచి క్రీ.పూ. 202 వరకు పరిపాలించాడు. అటుపిమ్మట పరిపాలకులైన సాతవాహన రాజులలో క్రీ.శ. 78 నుంచి 102 వరకు పరిపాలన చేసిన గౌతమీపుత్ర శాతకర్ణి చాలా శక్తిమంతుడైన చక్రవర్తి. సాతవాహన చక్రవర్తుల కాలంలో ఆంధ్రసామ్రాజ్యం మంచి ఉచ్చదశలో ఉండి, శాంతి సౌభాగ్యాలతో తులతూగింది. వివేకవంతులైన ఈ ఆంధ్ర చక్రవర్తుల ఆదరాభిమానాలవల్ల ఆ నాడు కళలు, సాహిత్యం, వాణిజ్యం, మతం బాగా పెంపొందాయి. సుప్రసిద్ధ సాతవాహన చక్రవర్తి అయిన హాలుడు 'గాథా సప్తశతి'ని కూర్చినాడు. తెలుగు గడ్డ మీద ప్రభవించిన తొలికావ్యం 'గాథా సప్తశతి'. సాతవాహనుల మంత్రి అయిన గుణాఢ్యుడు 'బృహత్కథ'ను రచించాడు. ప్రాకృత సాహిత్యంలో ఈ రెండు గ్రంథాలు

చాలా ప్రామాణిక రచనలు. ప్రాకృత భాషాలాలిత్యం, గాథల కమనీయత తెలియటం కోసం గాథాసప్తశతినుంచి ఒకటి రెండు ఉదాహరణలు:

అఉలీణో దోముహజో తామహురో భో అణం ముహే జావ।
మురజో వ్వ ఖలో జిణ్ణమ్మిభో అణే వర సమారసఇ ॥ [III-53]

— ముఖమున బోనమున్నంత వరకే మద్దెల మధురముగా పలుకును; అది పోగానే విరసముగా మొఱగును. అట్లే ఖలుడు ద్విజిహ్వుడై అన్నము తినుచున్నంతసేపు మధుర ముగాపలుకును; అది జీర్ణముకాగానే విరసముగా పలుకును!

ఒక హాస్యఘట్టము:

పాఅపడిఅస్స పఇణో పుట్టిం పుత్తే సమారుహత్తమ్మి।
దఢమణ్ణుదుణ్ణి ఆఏ విహాసో ఘరిణీఏ ణేక్కంతో ॥ [I-11]

— అలుక మానుమని వేడుచు ఇల్లాలి పాదములయందు పడియున్న పతి వీపుమీద పుత్రుడెక్కి కేరింతాలు కొట్టు చుండగా ఎంత కోపంతో ఉన్నప్పటికీ ఆ ఇల్లాలు నవ్వు ఆపుకొనలేకపోయింది!

శాతవాహన సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రదేశం ఛిన్నాభిన్నమైంది. వేర్వేరు ఆంధ్ర భూభాగాలను ఇక్ష్వాకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, పల్లవులు, వాకాటకులు, బాదామి చాళుక్యులు ఆయాకాలాలలో పరిపాలించారు. విజయపురి రాజధానిగా క్రీ.శ. 220 నుండి 260 వరకు కొనసాగిన ఇక్ష్వాకు రాజుల పరిపాలనా కాలంలో, అచ్చట, సుప్రసిద్ధాలైన బౌద్ధస్తూపాలు, విహా

రాలు, విశ్వవిద్యాలయం నిర్మింపబడ్డాయి. మహాయాన బౌద్ధమత ప్రవక్త అయిన ఆచార్య నాగార్జునుడు అచ్చటనే వర్ధిల్లినాడు. ఈ స్తూపాలు, విహారాలు రాణులైన శాంతిశ్రీ, హమ్మసిరినికలచే నిర్మింపబడ్డాయి. ఇక్ష్వాకు రాజులలో శాంతిమూలుడు, వీరపురుషదత్తుడు వైదికమతావలంబులై అశ్వమేధయాగాలు చేశారు. క్రీ.శ. 7వ శతాబ్దిలో, తూర్పు సముద్రతీర ప్రాంతంలో, గోదావరీ మండలంలో తూర్పు చాళుక్యుల సామ్రాజ్యం వెలసింది. రాష్ట్రకూటులు, చివరి చాళుక్యులు తెలంగాణా ప్రాంతాన్ని పరిపాలించారు. తూర్పు చాళుక్య చక్రవర్తి అయిన రాజరాజ నరేంద్రుడు రాజమహేంద్రవరం (నేటి రాజమండ్రి) రాజధానిగా క్రీ.శ. 1062 వరకు పరిపాలించాడు. మనకు లభించిన తొలి తెలుగు కావ్యం రాజరాజనరేంద్రుని ఆస్థాన కవియైన నన్నయభట్టుచేత రచింపబడింది. అటుపిమ్మట, వరంగల్లు రాజధానిగా పరిపాలన చేసిన కాకతీయులు ప్రసిద్ధికి వచ్చారు. క్రీ.శ. 1198 నుంచి 1261 వరకు పరిపాలించిన కాకతీయ గణపతిదేవుడు సముద్ర తీరప్రాంతాన్ని, రాయల సీమను జయించి, తెలుగు ప్రజలందర్ని తన ఏలుబడిలోనికి తెచ్చినాడు. పిమ్మట ఆయన కుమార్తె రుద్రాంబ (క్రీ.శ. 1261-1296) అటు తరువాత ఆమె మనుమడు ప్రతాపరుద్రదేవుడు (క్రీ. శ. 1296 - 1323) కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించారు. క్రీ.శ. 1323లో మహమ్మద్ బిన్ తుగ్లక్ ప్రతాపరుద్రదేవుని సింహాసనభ్రష్టుని చేయటం సంభవించింది. కాకతీయుల పరిపాలనలో శాంతి, సౌభాగ్యాలు విలసిల్లినాయి. కళలు, సాహిత్యం పెంపొందాయి.

కాకతీయప్రతాపరుద్రుని ఆస్థానకవియైన విద్యానాథుడు రచించినదే నేటికీ భారతదేశమంతటా పఠనపాఠన వ్యవహార ప్రసిద్ధిలోనున్న అలంకారశాస్త్ర గ్రంథం " ప్రతాపరుద్ర యశోభూషణం ".

కొందరు సుప్రసిద్ధులైన ఆంధ్రవీరులు తుగ్లక్ జయించిన భూభాగాలను స్వతంత్రం కావించారు. తత్ఫలంగా రెడ్డిరాజులు కొండవీటి రాజ్యాన్ని, వెలమ దొరలు రాచకొండ రాజ్యాన్ని, హరిహర బుక్కరాయలు విజయనగర రాజ్యాన్ని పరిపాలించసాగారు. క్రీ. శ. 1345లో బహమనీ రాజ్యం పశ్చిమ దక్కన్ పీఠభూమిలో స్వతంత్ర ముస్లిం రాజ్యంగా నెలకొన్నది. స్వతంత్ర ప్రతిపత్తికోసం ఈ రాజ్యాలన్నింటి మధ్య నిరంతరం పోరు కొనసాగుతూనే ఉండేది. క్రీ. శ. 16 వ శతాబ్ది ప్రథమ పాదంలో బహమనీ రాజ్యం పతనమైన పిమ్మట చిన్న చిన్న ముస్లిం సంస్థానా లేర్పడ్డాయి. గోల్కొండ, అంటే నేటి హైదరాబాదు, రాజధానిగా కుతుబ్‌షాహీ వంశస్థులు రాజులైనారు. గోల్కొండ రాజ్యము క్రీ. శ. 1520 లో స్థాపింపబడింది.

ఆదిలో ఒక చిన్న రాజ్యంగా మొదలైన విజయనగర రాజ్యం పిమ్మట మహాసామ్రాజ్యంగా వెలసింది. క్రీ.శ. 1509 నుంచి 1529 వరకు పరిపాలన చేసిన శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యం చాలా ఉచ్ఛస్థితికి వచ్చింది. రాయలకాలంలోనే తెలుగు సాహిత్యం క్రొత్త దారిని త్రొక్కింది. ఆనాటి వరకు అనువాదాలే అధికంగా కొనసాగుతూ వచ్చాయి ; అందులకు భిన్నంగా ఆనాడు

కవులు తమ ఇష్టానుసారం కావ్యరచన చేయటం ఆరంభించారు. శ్రీకృష్ణదేవరాయల కొలువులో 'అష్టదిగ్గజాలు' అనే పేరుతో ఎనిమిది మంది ప్రఖ్యాత కవులు ఉండేవారు. వీరిలో 'మనుచరిత్ర' రచించిన అల్లసాని పెద్దన అగ్రగణ్యుడు. విజయనగర సామ్రాజ్యం క్రీ. శ. 1336 నుంచి 1564 వరకు వర్ధిల్లినది.

'రక్షస్-తంగడి' యుద్ధంలో అళియ రామరాయలు చనిపోవటంతో విజయనగర సామ్రాజ్యం ఛిన్నాభిన్నమైంది. విజయనగర సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రదేశం క్రమంగా గోల్కొండ కుతుబ్‌షాహీల ఆధిపత్యంలోకి వచ్చింది. కుతుబ్‌షాహీల కాలంలోనే ఫ్రెంచి, డచ్, ఇంగ్లీషు వర్తకులు తూర్పు కోస్తా ఆంధ్రప్రాంతాలైన మద్రాసు, మచిలీపట్టణం, భీమిలిపట్టణం మొదలైనచోట్ల వ్యాపార స్థావరాలేర్పరచుకొన్నారు. క్రీ. శ. 1687 లో ఔరంగజేబు గోల్కొండ కుతుబ్‌షాహీలను జయించాడు. ఆనాటినుంచి ఆంధ్రదేశంలోని 'తెలంగాణా' ప్రాంతం 'నైజాములు' అని పిలువబడే అసఫ్‌జాహీ పాలకుల పరిపాలనక్రిందకు వచ్చింది; అప్పటి పరిపాలకుడు నైజామ్-ఉల్-ముల్క్. అసఫ్‌జాహీల పరిపాలన క్రీ. శ. 1723 లో ఆరంభమై, క్రీ. శ. 1956 లో 'ఆంధ్రప్రదేశ్' ఏర్పడే పర్యంతం కొనసాగింది. నైజాము, ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు, మహారాష్ట్రులు, మైసూరుకు చెందిన టిప్పుసుల్తాన్—వీరి మధ్య జరిగిన సంఘర్షణలు కారణంగా ఒక ముప్పై సంవత్సరాల కాలంలో ఆంధ్ర భూభాగం ఆక్రమణవిషయంలో అనేకాలైన మార్పులు వచ్చాయి. చివరకు క్రీ. శ. 19వ శతాబ్ది ప్రారంభంలో

రాయలసీమ, కోస్తా జిల్లాలు బ్రిటిష్ సామ్రాజ్యం ఆధిపత్యం క్రిందకు వచ్చేశాయి.

ఆంధ్రరాజుల కాలంలో వైదిక-బౌద్ధ మతాలు ఆదరింపబడ్డాయి. విజయనగర సామ్రాజ్యం ఆవిర్భవించిన పిమ్మట హిందూ స్వాతంత్ర్యం, హిందూ నాగరకత సంరక్షింపబడుతూవచ్చాయి. ఇంతకుముందే పేర్కొన్నట్లుగా సాతవాహన రాజుల కాలంలోను, ఇక్ష్వాకుల కాలంలోనే ఆంధ్రదేశంలో బౌద్ధమతం కూడా వర్ధిల్లింది. ఆంధ్రులు ప్రయోగదృష్టియందలి ఔత్సుక్యంతో క్రొత్త క్రొత్త ఉద్యమాలన్నింటినీ ముందుగా చేపట్టేవారుగా కనిపిస్తారు. ప్రపంచమంతటా బౌద్ధమతంమీద విస్తృతమైన ప్రభావాన్ని చూపిన మహాయాన సిద్ధాంతాన్ని ఆచార్య నాగార్జునుడు వెలయింపజేశాడు. బౌద్ధమత విషయంలో ఘంటసాల, భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ—ఇవి అంతర్జాతీయ ప్రసిద్ధిని పొంది, విశ్వవిఖ్యాత యాత్రాస్థలాలైనాయి.

## వాస్తుకళ

వాస్తు కళా క్షేత్రములో ఆంధ్రులు అపూర్వ నిర్మాణాలకు సృష్టికర్తలైనారు. "నాలుగు ఆయక వేదికలను కలపటం, చక్కని శిల్పాలతో కూడుకొన్న చలువరాతి పలకలతో ఇటుక కట్టడాలను పూరించటం ఆంధ్రుల ప్రత్యేకత; ఇవి స్తూపాలకు గంభీరతను, అందాన్ని చేకూర్చాయి. అమరావతీ మహాచైత్యమందలి చలువరాతి పలకల వరుసలు, ప్రఖ్యాతమైన సాంచీ స్తూపమందలి తోరణాలు బౌద్ధ వాస్తుకళ చరిత్రలో అపూర్వ నిర్మాణాలు."

"విజయపురి ఇక్ష్వాకులు దేవాలయ నిర్మాణోద్యమాన్ని చాలా పట్టుదలతో ప్రారంభించారు. పల్లవులు ఆ ఉద్యమాన్ని కొనసాగించి, అభివృద్ధి పొందించారు. విష్ణుకుండులు బౌద్ధుల గుహారామ వాస్తుకళను అనుకరించారు; హిందూదేవతలకు అంకితాలైన పెక్కు గుహాలయాలను త్రవ్వించి వెలికి తీయించారు. పల్లవులు ఈ పద్ధతినే పాటించి, దీన్ని దక్షిణ హిందూదేశంలో అభివృద్ధిపరచారు. ఆంధ్రదేశానికి సంబంధించిన ఈ ద్వివిధమైన సంప్రదాయం ప్రఖ్యాతమైన మహాబలిపురం రాతిరథాల రూపంలో ఘనీభవించింది."

"దేవాలయ వాస్తుకళకు సంబంధించిన నగర, వేసర, ద్రవిడ అనే ప్రధాన శైలులు మూడున్నూ ఆంధ్రదేశంలో చాళుక్యుల కాలంలో ఆదరణ పొందాయి. వేసర శైలికి పరాకాష్ఠ అని చెప్పబడే వక్రరేఖావృతమైన గోపురం, అమలక శిఖరం—ఇవి కలిగిన వేసరశైలి దేవాలయాలు ఆంధ్రదేశంలో మూడుచోట్ల కనబడుతున్నాయి. తరువాతి చాళుక్యుల కాలానికి సంబంధించిన వాస్తుకళ శైలులను కాకతీయులు అవలంబించి, పెక్కు క్రొత్త పోకడలను మిళితంచేసి, తెలంగాణాలోని వరంగల్లు జిల్లాలో ఉన్న హనుమకొండ, రామప్ప మున్నగు ప్రదేశాలల్లో సుందరములైన పెక్కు కట్టడాలను వెలయింపజేశారు." (రామప్ప గుడిని, అందలి ఒక నృత్యభంగిమను అట్టమీద చూడవచ్చును)

మధ్యయుగానికి చెందిన దక్కను చరిత్రలో ఈ దేవాలయాలు హిందూ వాస్తుకళకు పరాకాష్ఠ అని చెప్పవచ్చు. ప్రసిద్ధులైన విజయనగర చక్రవర్తులు ఒక క్రొత్త

దేవాలయనిర్మాణశైలిని కనుగొన్నారు. ఈ శైలికి సంబంధించిన స్వచ్ఛమైన కట్టడాలను రాయలసీమ జిల్లాలలో చూడవచ్చు."

—*మారేమండ రామారావు*

పురాతనాలైన ఇట్టి కట్టడాలను దక్షిణ దేశంలో వెల్లూరు, తంజావూరు, మధుర, జింజి, పుదుక్కోట మొదలగు ప్రాంతాలలో కూడా చూడవచ్చు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం తంజావూరులో తెలుగు నాయక రాజులైన రఘునాథ నాయక-విజయరాఘవ నాయకులు, మధురలో విజయరంగ చొక్కనాథుడు, పుదుక్కోటలో రాజా రఘునాథుడు స్వతంత్రులైనారు.

క్రీస్తు శకారంభంలో, అంటే సాతవాహన రాజుల కాలంలో ఆంధ్రులు కొందరు ప్రాగ్దక్షిణ ఆసియా దేశాలకు వలస వెళ్ళారు. ఆయా దేశాలలో కనుపట్టే అమరావతి, విజయపురి, సింహపుర, కళింగ మున్నగు స్థల నామాలు ఆంధ్రులు వలస వెళ్ళారనడానికి తార్కాణాలు. శక సంవత్సరాలలో ఈయబడిన తేదీలుకల శాసనాలు, క్రీస్తు శకారంభ శతాబ్దాలకు చెందిన తెలుగు లిపిలో వ్రాయబడిన శాసనాలు, అమరావతి శైలికి చెందిన శిల్పాలు ఈ దేశాలలో కనుగొనబడ్డాయి.

## జాతీయోద్యమం

జాతీయ స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రులదెల్లప్పుడూ ముందంజయే. క్రీ. శ. 1885 లో 'ఇండియన్ నేషనల్

కాంగ్రెస్' ఉద్భవించటంతో జాతీయ మహోద్యమం ఆరంభమైంది. భారతీయ సైనికుల తిరుగుబాటుతో క్రీ. శ. 1857 లోనే నిజంగా స్వాతంత్ర్య సమరం ఆరంభమైనదన్న సత్యం మనకందరకూ తెలుసు. ఈ సైనికుల తిరుగుబాటును తాంతియాతోపే, ఝాన్సీరాణి మున్నగు జాతీయ మహాయోధులు బలపర్చటంతో సైనికుల తిరుగుబాటు 'స్వాతంత్ర్యసమర' రూపంతాల్చింది. తరువాతి పరిశోధనలను బట్టి భారతదేశంలో బ్రిటిషువారి అధికారం స్థిరపడినప్పటినుంచీ స్వాతంత్ర్యంకోసం సమరం సాగుతూనే ఉన్నదని తెలుస్తోంది. కృష్ణా జిల్లాలోని నూజివీడుకు చెందిన నారయప్పారావు, దక్షిణ దేశానికి చెందిన పాండ్య సరదారు కట్టబొమ్మ (ఇతడు కూడా ఆంధ్రుడే) — ప్రసిద్ధులైన ఈ ఇరువురు సరదార్లు 18 వ శతాబ్ది రెండవ భాగంలో బ్రిటిషువారిని ఎదిరించి పోరాడినారు. క్రీ. శ. 1783 లో నారయప్పారావు ఈస్టు ఇండియా కంపెనీవారి అధికారులతో పోరాటం సాగించాడు. ఆయన కుమారుడు రామచంద్ర అప్పారావు కూడా ఈ పోరాటం కొనసాగించాడు. చివరకు నూజివీటి అప్పారావుతో బ్రిటిషువారు సంధిచేసికొన్నారు. క్రీ. శ. 1795 లో కట్టబొమ్మ ఈస్టు ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా తిరుగుబాటు సాగించాడు. కాని దురదృష్టవశాత్తు నమ్మినవారిచేత మోసగింపబడి, బ్రిటిషువారికి చిక్కి, కట్టబొమ్మ ఉరితీయబడినాడు. భారతీయ స్వాతంత్ర్య సమరం ఆరంభంకావటానికి ఇంచుమించుగా 75 సంవత్స

రాలకు ముందే ఈ సరదార్లు ఇరువురు బ్రిటిషువారిపై తిరుగుబాటుకు మార్గదర్శకులైనారు.

## ఆంధ్రోద్యమం

భాష ప్రాతిపదికగా రాష్ట్రాల పునర్విభజన జరగాలన్న ముఖ్యాశయంతో క్రీ. శ. 1913 లో ఆంధ్రోద్యమం ఆరంభమైంది. ఈ విషయంలో తక్కిన రాష్ట్రాల వారికి ఆంధ్రులే మార్గదర్శకులు. ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెస్ సంఘం కావాలన్న ఆంధ్రుల కోర్కెను క్రీ. శ. 1917 లో భారతజాతీయ కాంగ్రెస్ అంగీకరించింది. ప్రత్యేకరాష్ట్ర వాంఛ ఆంధ్రులలో ఎల్లప్పుడూ ప్రబలంగానే ఉంటూ వచ్చింది. ఈ ఆందోళన ఫలితంగానే క్రీ. శ. 1926 లో ఆంధ్రవిశ్వవిద్యాలయం నెలకొల్పబడింది. నాటి నుంచి క్రీ. శ. 1950 వరకు భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సమస్య మద్రాసురాష్ట్ర శాసన సభలోను, కేంద్ర శాసన సభలోను చర్చింపబడుతూనే ఉంది. స్వరాజ్యం సిద్ధించిన పిమ్మటనే భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సమస్య చేపట్టాలని క్రీ. శ. 1936 లో జాతీయ కాంగ్రెస్ నిర్ణయించింది.

క్రీ. శ. 1947 లో స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట ఆంధ్రరాష్ట్ర విభజన జరగాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తీసికొని వచ్చారు ఆంధ్ర నాయకులు. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన సమస్యపై సమగ్రమైన ఒక నివేదిక సమర్పించటం కోసం పండిత జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యలతో కూడుకొన్న ఒక ఉపసంఘాన్ని జైపూర్ సభల సమయంలో

ఏ. ఐ. సి. సి. నియమించింది. 'జె. వి. పి. రిపోర్టు' అనే పేర ప్రసిద్ధికెక్కిన ఈ ఉపసంఘ నివేదికలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణం సిఫారసు చేయబడింది. ఈ ఉపసంఘ నియామకానికి ముందే జస్టిస్ థార్ అధ్యక్షతలో ఒక సంఘం నియమింపబడింది. ఈ సంఘం భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన సూత్రాన్ని వ్యతిరేకించినప్పటికీ ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్యను ప్రత్యేకంగా ఆలోచించాలని సిఫారసు చేసింది. అయినప్పటికీ ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణం విషయంలో ఎట్టి చర్య తీసికోబడలేదు. చివరకు క్రీ. శ. 1949 లో ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణ విషయంలో కచ్చితమైన సూచనలు చేయటంకోసం ఒక విభజన సంఘాన్ని కేంద్రప్రభుత్వం నియమించింది. క్రీ. శ. 1950 లో ఈ సంఘం తన నివేదికను సమర్పించింది. 1950 జనవరి 26 వ తేదీనాటికి ప్రత్యేకాంధ్రరాష్ట్రం ఏర్పడగలదని అందరూ ఆశించారు. కాని, ప్రత్యేకాంధ్రరాష్ట్రం నిర్మాణం వాయిదా వేయబడిందని కేంద్రప్రభుత్వం ప్రకటించటంతో అంతటా నిరాశ అలముకొంది.

ఇట్టి సమయంలో పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర నిర్మాణంకోసం ఆమరణదీక్షను పట్టారు. ఈ ఉపవాస దీక్షతో ఆంధ్రులలో అలజడి, అశాంతి అధికమైనాయి ; ఆంధ్ర రాష్ట్రం ఏర్పడనిదే ఆంధ్రులు తృప్తిచెందరన్న విషయం స్పష్టమైంది. చివరకు పొట్టి శ్రీరాములు ఆత్మాహుతి అయినారు. ఆమరణఉపవాసదీక్ష పట్టి, ఆత్మాహుతి అయిన ముప్వురు ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులలో శ్రీరాములు ఒకరు అయినారు. ఈ ఆత్మాహుతి కారణంగా కేంద్ర

ప్రభుత్వ వైఖరిలో మార్పువచ్చింది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం విషయంలో సమగ్ర నివేదికను సమర్పించటంకోసం జస్టిస్ వాంఛూను కేంద్రప్రభుత్వం నియమించింది. క్రీ. శ. 1953 అక్టోబరు 1 వ తేదీన కర్నూలు రాజధానిగా, ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా ఆంధ్రరాష్ట్రం అవతరించింది.

భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్విభజించాలన్న సమస్యను కూలంకషంగా పరిశీలించి, నివేదికను సమర్పించటం కోసం ఫజుల్ ఆలీ అధ్యక్షతలో ఒక సంఘాన్ని కేంద్రప్రభుత్వం నియమించింది. ఈ సంఘం తన నివేదికను క్రీ.శ. 1955 లో సమర్పించింది. కేంద్రప్రభుత్వం ఈ నివేదికను అంగీకరించి, రాష్ట్రాలను భాషా ప్రాతిపదికపై పునర్విభజించటానికి తగిన చర్య తీసికొంది. తత్ఫలితంగా నేటి వివిధ రాష్ట్రాలు 1956 నవంబరు 1 వ తేదీన రూపొందింప బడినాయి. నిజాము పరిపాలన అంతమై తెలంగాణా కూడా చేరిపోవటంతో ఆంధ్రరాష్ట్రం, 'ఆంధ్రప్రదేశ్' అయి, హైదరాబాదు రాజధానీ నగరం అయింది. ఈ విధంగా నిరంతరసంఘర్షణవల్ల, త్యాగాలవల్ల 3½ కోట్ల ఆంధ్రులు స్వరాష్ట్రాన్ని పొందగలిగారు.

## సాహిత్యం

ఇప్పుడింక బహుముఖమైన ఆంధ్ర సంస్కృతిని పరిశీలించుదాము. ముందుగా 'సాహిత్యం' తో ఆరంభిస్తాను.

ఇంతకుముందే పేర్కొన్నట్లుగా తూర్పు చాళుక్య రాజు అగు రాజరాజ నరేంద్రుని ఆస్థానకవి అయిన నన్నయభట్టు క్రీ. శ. 11 వ శతాబ్దిలో అనువదించిన ఆంధ్ర

మహాభారతమే మనకు లభించిన తొలి తెలుగు మహాకావ్యం. ఈ ఆంధ్ర మహాభారతం ప్రౌఢరచన కాబట్టి అంతకుముందు కూడ కొన్ని కావ్యాలు రచింపబడి ఉండాలి; కాని, దురదృష్టవశాత్తు అవి అలభ్యాలైనాయి. నన్నయ కవిత్వంలో సంస్కృత పదాల పాలు అధికం; అయినప్పటికీ అది మనోహరమైన సరళ రచన. తన రచనను గూర్చి నన్నయభట్టు క్రిందివిధంగా చెప్పుకొన్నాడు:

"సారమతింగవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయు క్తిలో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నా రుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు దెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్."

—(ఆది. పర్వా. ప్ర. ఆ. **25** ప.)

నన్నయ మహాభారతంలో ఆది-సభా పర్వాలను, అరణ్యపర్వంలో కొంతభాగాన్ని అనువదించాడు. క్రీ.శ. 13వ శతాబ్దిలో నివసించిన మరియొక తెలుగు మహాకవి తిక్కన మహాభారతాంధ్రీకరణ భారం వహించాడు. తిక్కన మహాకవియే కాక మహా సేనాపతి అనికూడ ప్రసిద్ధి. ఆవేశ కారకాలు, ఆకర్షణీయాలు అయిన కొన్ని ఘట్టాలలో తిక్కన కవిత్వం కవితాంశంలోను, నాటకీయ రచనా పద్ధతిలోను వ్యాసుని సంస్కృత భారతాన్ని సులువుగా మించుతుంది. ఈ తిక్కన 'కవిబ్రహ్మ' బిరుదాంచితుడు. క్రీ. శ. 14 వ శతాబ్దిలో నివసించిన ఎఱ్ఱాప్రెగడ, నన్నయ తిక్కనలు వదలివేసిన భారతారణ్యా శేషభాగాన్ని, హరి వంశాన్ని అనువదించి, ఆంధ్ర మహాభారతాన్ని సంపూర్ణం

చేశాడు. ఈ ముగ్గురు ఆంధ్రమహాభారతకర్తలను 'కవిత్రయము' అంటారు. ఈ ఆంధ్రమహాభారతం తెలుగులో తొలికావ్యమే కాక తెలుగు భాషా-సారస్వతాల విషయంలో ప్రామాణికమైన కావ్యంకూడాను.

క్రీ. శ. 15 వ శతాబ్దిలో శ్రీనాథ, పోతనలు అవతరించటంతో తెలుగు సాహిత్యంలో ఒక క్రొత్తయుగం ఆరంభమైంది. శ్రీనాథుడు నిజానికి 'విశ్వకవి'. అంతేకాదు, పాలకులైన రాజులతోపాటు జీవిత భోగభాగ్యాలను పూర్ణంగా అనుభవించాడు; భౌతిక విషయాలలో బాగా నిమగ్నుడైనాడు. జీవితావసాన సమయంలో శ్రీనాథుడు చెప్పిన క్రింది పద్యం గమనింపదగినది:

"కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి,
రత్నాంబరంబు లే రాయఁడిచ్చు?
రంభఁగూడెఁ దెనుంగు రాయరాహుత్తుండు,
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱిహేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁగలదు?
కైలాసగిరిఁ బండె మైలారు విభుఁడేగి,
దినవెచ్చ మేరాజు దీర్పఁగలఁడు?
భాస్కరుఁడు మున్నె దేవుని పాలికరిగెఁ,
గలియుగంబున నిఁకనుండఁ గష్ట మనుచు
దివిజ కవివరు గుండియల్ దిగ్గురనఁగ,
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి."

సంస్కృతభాషపై బాగా అధికాధికారం కలవాడు శ్రీనాథుడు. అతడు హర్ష నైషధాన్ని 'శృంగార నైషధము' అన్న పేరుతో ప్రౌఢంగా ఆంధ్రీకరించాడు. ఆనాటి సామాన్యుల జీవిత-సంప్రదాయాలను చిత్రీకరించిన 'క్రీడాభిరామం' అనే కావ్యాన్ని కూడా శ్రీనాథుడే రచించాడని కొందరు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

రాజులను రాజాస్థానాలను, భోగాలను భాగ్యాలను దూషించి తిరస్కరించిన పోతన శ్రీనాథునకు పూర్తిగా విరుద్ధం. పోతనభాగవతాన్ని ఆంధ్రీకరించాడు. ఆయన అనువాదం పద్యానికి పద్యంగా సాగలేదు; అనువాదం మూలంకంటె అధికమైంది. పోతన భక్త్యావేశం సాటిలేనిది. ఆయన శైలిధారాళంగా, శ్రావ్యంగా, లయానుగుణంగా ఉంటుంది. పోతన పద్యాలు తెలుగు ప్రజలకు చాలా ప్రీతి పాత్రాలైనాయి.

పిమ్మట శ్రీకృష్ణదేవరాయల యుగం ఆరంభమైంది. ప్రబంధరూపం తాల్చిన తెలుగు సాహిత్యానికి అది స్వర్ణయుగం. తెలుగు భాషయందు తనకు గల గాఢాభిమానాన్ని, ఆ భాషా వైశిష్ట్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు క్రిందివిధంగా చాటి చెప్పినాడు:

"తెలుఁగదేల యన్న దేశంబు దెలుఁ, గేను
దెలుఁగు వల్లభుండఁ, దెలుఁగొ కండ,
యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశ భాషలందుఁ దెలుఁగు లెస్స."

—(ఆముక్తమాల్యద. I–15)

ఇంతకుముందు చారిత్రక విభాగంలో పేర్కొ న్నట్లుగా ప్రసిద్ధ విజయనగర కవులు ఎనమండుగురు. వారు పురాణానువాదాలతో తృప్తిచెందక, రచనా స్వాతంత్ర్యం పొందారు. రామరాజభూషణుని మాటలలో ప్రబంధకవుల రచనా విధానం క్రింది విధంగా స్పష్టమవుతోంది:

"కేవల కల్పనాకథలు కృత్రిమరత్నము లాద్యసత్కథల్
వావిరిఁ బుట్టు రత్నము లవారిత సత్కవి కల్పనా విభూ
షావహ పూర్వవృత్తములు సానలఁ దీరిన జాతిరత్నముల్
గావున నిట్టి మిశ్రకథగా నొనరింపుము నేర్పు పెంపునన్."

—(వసుచరిత్ర. I–*19*)

'మనుచరిత్ర' రచించిన అల్లసాని పెద్దన ఈ ఎనమండు గురిలోను సుప్రసిద్ధుడు; అంతేకాదు పెద్దన 'ఆంధ్ర కవితా పితామహ' బిరుదాంచితుడు. ఈ కావ్యం వైశాల్యంలో పెద్దదైనప్పటికీ ఆసాంతం మనోహరంగా ఉంటుంది. మను చరిత్ర రచన ఉదాత్తమై, భాష సంస్కృత పదబహుళము, శ్రావ్యము, లయాన్వితమునై అలరారుతూ ఉంటుంది. తెలుగుభాషలో ఇది ఒక ప్రామాణికమైన రచన. శ్రీకృష్ణ దేవరాయలు ఈ మహాకవిని "ఎదురైనచోఁ దన మద కరీంద్రము నిల్పి, కేలూత యొసఁగి యెక్కించు"కొనే వాడట!

శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా కవి; 'ఆముక్త మాల్యద' అనే ప్రౌఢకావ్యాన్ని రచించాడు. ఈ కావ్య రచనాశైలి జటిలమై, నారికేళపాకంలో ఉంటుంది. ముక్కుతిమ్మన, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు మున్నగు

మహాకవులంతా ఈ యుగానికి చెందినవారే. క్రీ. శ. 16 వ శతాబ్ది రెండవ భాగానికి చెందిన పింగళి సూరన 'కళాపూర్ణోదయము' అనే ఉత్తమ కావ్యం రచించాడు; దీన్ని 'కావ్యరూపంలో ఉన్న నవల' అంటే అతిశయోక్తి కాదు. అంతేకాదు, ఇది కేవలం కల్పిత కథ కూడాను. అపూర్వమైన విధంగా సంగీత సాహిత్యాలు మేళవించిన రామరాజభూషణుని 'వసుచరిత్ర' ఆనాటి మరియొక ఉత్తమ కావ్యం. ఆలంకారిక పదప్రయోగానికి, భావనా వైశిష్ట్యానికి, వ్యంగ్యసంపదకు, శ్లేషమాధుర్యానికి ప్రత్యేకత వహించిన వసుచరిత్ర తెలుగులోని పంచ కావ్యాలలో విశిష్టస్థానం సంపాదించుకొంది.

విజయనగర సామ్రాజ్య పతనానంతరం కొందరు తెలుగు కవులు దక్షిణదేశానికి తరలివెళ్ళి తంజావూరు, మధుర మొదలగు ప్రాంతాలలో స్థిరపడ్డారు. అచ్చట, తెలుగు సాహిత్యంలో వారొక క్రొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారు. సారంగు తమ్మయ్య రచించిన 'వైజయంతీ విలాసము', చేమకూర వేంకటకవి రచించిన 'విజయ విలాసము' తెలుగులో సుప్రసిద్ధాలైన కావ్యాలు. "ప్రతి పద్యమునందుఁ జమత్కృతి గలుగం జెప్పనేర్తు"నని చెప్పు కొన్నవాడు చేమకూర వేంకటకవి. క్రీ. శ. 18 వ శతాబ్దిలో పలువురు కవులు రచనలు చేసినప్పటికీ చెప్పుకో దగిన గొప్ప కావ్యాలేమీ వెలువడలేదు. కవుల రచనలలో స్వాతంత్ర్యం కాని, శైలిలో రమ్యత కాని కన్పట్టదు. క్షీణదశ ప్రారంభమైనదని చెప్పవచ్చు.

తెలుగు వాఙ్మయశాఖలలో చెప్పుకోదగిన విశిష్టమైన శాఖ 'శతక' వాఙ్మయం. భక్తి, నీతి, వేదాంతం, విమర్శ—అనే అంశాలు శతక రచనకు ప్రేరేపకాలు. క్రీ. శ. 18 వ శతాబ్దిలో నివసించిన వేమన శతకకవులలో సుప్రసిద్ధుడు.

క్రీ.శ. 15వ శతాబ్దిలో నివసించిన అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామి భక్తులలో అగ్రేసరుడు. అన్నమాచార్యులు తెలుగులో రచించిన 'వేంకటేశ్వర వచనాలు' సుప్రసిద్ధాలైనాయి. క్రీ. శ. 18 వ శతాబ్దిలో నివసించిన క్షేత్రయ్య సుప్రసిద్ధుడైన పదకర్త. క్షేత్రయ్య పదాలు దాక్షిణాత్య నృత్యానికి నికషోపలాలు. క్రీ.శ. 18వ శతాబ్ది తొలి భాగంలో నివసించిన త్యాగరాజు కర్ణాటక సంగీత సంప్రదాయానుసారంగా తెలుగు భాషలో రమ్యమైన కృతులు రచించిన సుప్రసిద్ధ వాగ్గేయకారుడు. "నిధిచాల సుఖమా ? రాముని సన్నిధి సేవ సుఖమా ? నిజముగ బల్కు మనసా !" (కల్యాణి-చాపు) అని తర్కించుకొని, "సుమతి త్యాగరాజ నుతుని కీర్తన"మే సుఖమని నిర్ణయించుకొన్న వాడు త్యాగరాజు. "సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మా తండ్రి" (లలితా-రూపకం) అని పాడుకొన్న త్యాగరాజునకు రామునిపైగల భక్తి, ఆయన కృతులయందలి పదలాలిత్యం, సారళ్యం సాహిత్యప్రపంచంలోను, భక్తిసంగీత విషయంలోను నిరుపమానములైనాయి. అనునాసిక్యం, అజంతత్వం, మహాప్రాణాక్షరరాహిత్యం కారణాలుగా తెలుగు భాష మధురతరమై సంగీతానికి చాలా అనుకూలమైంది. త్యాగరాజు వాక్కులలో అది భక్తిసంగీతానికి పరమమైన సాధనఅయింది.

19వ శతాబ్ది మధ్య భాగంలో, ఆంగ్ల - వంగ సంప్రదాయాల ప్రభావం బాగా ప్రసరించిన కాలంలో ఆధునిక తెలుగు వాఙ్మయం ఆరంభమైనదని చెప్పవచ్చు. క్రీ. శ. 19 వ శతాబ్ది మధ్యభాగం వరకు తెలుగులో వచన వాఙ్మయం పెంపొందనేలేదు. ఆధునిక తెలుగు వచన రచనకు కందుకూరి వీరేశలింగం మార్గదర్శకులు. ఆయన నాటకాలు, జీవిత చరిత్రలు రచించటం మాత్రమే కాక స్వీయచరిత్ర కూడా రచించుకొన్నారు. అంతేకాదు సాహిత్య సాధనగా వచన రచనను తీర్చిదిద్దినారు. కృష్ణాపత్రిక సంపాదకులైన ముట్నూరి కృష్ణారావు తెలుగు పత్రికా రచనలో ప్రామాణికులు. ఆయన మంచి వ్యాస రచయిత. రాజకీయ, సాహిత్య, వేదాంత, సంఘసంస్కరణాది విషయాలను సుస్పష్టంగా చర్చించటానికి చాలా అనువైన ఒక క్రొత్త శైలినివారు అవలంబించారు. పానుగంటి లక్ష్మీనరసింహారావు ఛలోక్తులను విసరటంలో, హాస్యరచనలో అందెవేసిన తెలుగు రచయిత. ఆయన శైలి తెలుగు దేశమంతటా ప్రజాదరణ పొందింది.

క్రీ. శ. 19 వ శతాబ్ది ఆరంభంలో ప్రామాణికమైన, సమగ్రమైన తొలి తెలుగు వ్యాకరణం ('బాల వ్యాకరణం') రచించినవాడు చిన్నయసూరి.

'తిరుపతి వేంకటకవులు' అను పేర సుప్రసిద్ధులైన గొప్ప జంట కవులు దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి. వారు తమ అవధానాలతో తెలుగు కవిత్వాన్ని ప్రజలకు సన్నిహితంచేశారు. సరళము, మనో

హారము, ప్రామాణికము అయిన భాషలో వారు రచనలు చేశారు. వారి కావ్యాలు, నాటకాలు కూడా తెలుగు నాట చాలా ప్రసిద్ధిపొందాయి. ఈ జంట కవులలో చెళ్ళపిళ్ళవారికి శిష్యసంపద అధికము. నాడు ప్రసిద్ధికెక్కిన తెలుగు కవులలో నూటికి తొంబది మంది వారి శిష్యులే. విశ్వనాథ సత్యనారాయణ పేర్కొన్నట్లుగా

"తనయెద యెల్లమెత్తన, కృతప్రతి పద్యము నంతకంటె మెత్తన తన శిష్యులన్న నెడదంగల ప్రేముడి చెప్పలేని మెత్తనయయి శత్రుపర్వత శతారము సత్కవి చెళ్ళపిళ్ళ వేంకన గురువంచుఁ జెప్పికొనగానది గొప్ప తెలుంగునాఁడునన్"

వంగ సాహిత్యంచేత—ముఖ్యంగా రవీంద్రనాథ టాగూర్ చేత—ప్రభావితులైన రాయప్రోలు సుబ్బారావు గారితో తెలుగు కవిత్వం క్రొత్తమార్గం త్రొక్కింది. ఆయన నాందీపూజ కావించిన కాల్పనిక సంప్రదాయాన్ని తెలుగులో 'భావకవిత్వము' అంటారు. ఈ భావకవిత్వ సంప్రదాయం కృష్ణశాస్త్రి, రామిరెడ్డి, జాషువా, నండూరి సుబ్బారావు ప్రభృతుల చేతుల్లో తీర్చిదిద్దబడింది. పీడిత జాతుల, అస్పృశ్యుల కష్టాలను మనోహరమైన కవిత్వంలో చిత్రించిన సమర్థుడైన తొలి హరిజన క్రిస్టియన్ కవి గుర్రం జాషువా. పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వర రావులు క్రొత్తయుగానికి చెందినవారు; వారి 'సౌందర నందము' ఒక ఉత్తమ ఆధునిక తెలుగు కావ్యం. పింగళి లక్ష్మీకాంతం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో తెలుగు భాషా శాఖాధ్యక్షులుగా చిరకాలం పనిచేసి తెలుగు భాషా-సాహిత్యాల బోధనను సువ్యవస్థితం చేశారు. ప్రసిద్ధ కవులైన

గడియారం వేంకటశేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు రాయలసీమప్రాంతం కవులు.

విశ్వనాథ సత్యనారాయణ బహుముఖ ప్రజ్ఞావంతుడైన రచయిత. ఆయన వచనము, నాటకము, గేయము, కథానిక మున్నగు పలుశాఖలలో ఉదాత్తమైన రచనలుచేసి తెలుగు సాహిత్యానికిపుష్టి చేకూర్చారు. వారి 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము' ఆధునిక యుగంలోవెలువడిన ఒక మహాకావ్యం. "కవి ప్రతిభలోన నుండును గావ్య శతాంశములయందుఁ దొంబదియైనపాళ్ళు। ప్రాగ్వి పశ్చిన్మతంబున రసము వేయిరెట్లు గొప్పది నవకథాదృతినిమించి" అన్న ప్రత్యయంతో ఆరంభమైనదీ మహాకావ్యరచన.

ఇంక యువతరం కవులలో శ్రీశ్రీ చాలా ప్రగతి భావాలుగల కవి. ఆయన రచనా పద్ధతి అధివాస్తకవితకు చెందింది; ఛందస్సంప్రదాయాలనన్నింటిని త్రోసిపుచ్చి రచనలు సాగించారు. శ్రీశ్రీ పూర్తి పేరు శ్రీరంగం శ్రీనివాసరావు.

నండూరి సుబ్బారావు 'యెంకిపాటలు' ఆధునిక కాలంలో వెలువడిన ఉత్తమ గేయకావ్యం.

ఒక ఉదాహరణం :

ఆరిపేయవె దీపమూ !
యెలుగులో నీమీద నిలపలేనే మనసు !
ఆరిపేయవె దీపమూ !

జిమ్మ్మమంటా తోట సీకటైపోవాలి,
సీకట్లో సూడాలి నీకళ్ళ తళతళలు ! ॥ ఆరిపేయవె ॥

తళుకుతో నీరూపు తలుసుకొని తలుసుకొని,
సీకట్లో నాకళ్ళు సిల్లులడ సూడాలి! ॥ ఆరిపేయవె ॥
సూపులే ఆపేసి, రూపువూసే మరిసి,
వొకరెరుగ కింకొకరు వొరిగి నిదరోదాము! ॥ ఆరిపేయవె ॥

తెలుగులో అధునిక సాంఘికనవల విషయంలో ఉన్నవ లక్ష్మీనారాయణ మార్గదర్శకులు. సరళము, సహజము అయిన శైలిలో రచింపబడిన వారి 'మాలపల్లి' హరిజనుల జీవితంపై వ్రాయబడిన తొలి ఉత్తమ సాంఘికనవల.

గుడిపాటి వేంకటచలం సాంఘిక విప్లవవాది. ఆయన కథానికలు, నాటికలు ప్రజలలో గొప్ప అలజడిని కలిగించాయి. సాంఘికనీతి సూత్రాలకు ఆయన కట్టుబడక పోవటాన్ని అవినీతిక్రింద జమకట్టి చాలామంది అలజడి పొందారు. 'కథక చక్రవర్తి' చింతాదీక్షితులు, అంతర్జాతీయ బహుమానం గడించుకొన్న పాలగుమ్మి పద్మరాజు ప్రసిద్ధ కథానికా రచయితలు. ఉమర్ ఆలీషా, జాషువా, జోసెఫ్‌లు హైందవేతరులలో ప్రసిద్ధ తెలుగు కవులు. సురవరం ప్రతాపరెడ్డి, పద్మశ్రీ మాడపాటి హనుమంతరావు, డాక్టరు బూర్గుల రామకృష్ణారావులు తెలంగాణా ప్రాంతంలో ఆధునిక సాహిత్యోద్యమానికి కర్ణధారులు; వారు ముప్పురూ ఉర్దూ భాషలోకూడా మంచి పండితులు. దాశరథి, నారాయణరెడ్డి మున్నగు యువరచయితలు పలువురు బహుముఖ ప్రజ్ఞావంతులై వివిధ సాహిత్య శాఖలలో రచనలు సాగిస్తున్నారు.

ఇంక తెలుగు భాషావిషయంలో గిడుగు రామమూర్తి ప్రథమగణ్యులు. తెలుగు సాహిత్యంలో వ్యావహారిక భాషకు ప్రవేశం కలగటానికి ఆయన మార్గదర్శకులు. వారికి సహాయకులై, అనుచరులై పనిచేసిన వారి కుమారుడు డాక్టర్ గిడుగు వేంకట సీతాపతి తండ్రితో సాటిరాగలవిద్వాంసులు. సీతాపతి తోడ్పాటుతో తెలుగులో వివిధ సాహిత్య శాఖల స్వేచ్ఛాభివృద్ధికి వ్యావహారికభాష సజీవ సాధనమైంది. రామమూర్తి ప్రభావంవల్ల పురాతనభాష స్థానంలో సజీవభాష అయిన వ్యావహారికభాష స్థిరపడింది. ఇంక యువతరం వారిలో వడ్లమూడి గోపాలకృష్ణయ్య వ్యావహారిక భాషోద్యమాన్ని సమర్థవంతంగా చేపట్టి, దానికి ప్రత్యేక వ్యాకరణం కూడా రచించారు. తెలుగు భాషా ప్రపంచంలో ఇంకా సుప్రసిద్ధులైనవారు వర్ధిల్లుచిన సీతారామస్వామిశాస్త్రి, డాక్టర్ చిలుకూరి నారాయణరావు, గంటిజోగి సోమయాజి, కోరాడ రామకృష్ణయ్య, నిడుదవోలు వేంకటరావు, డాక్టర్ భద్రిరాజుకృష్ణమూర్తి.

ఇంక విమర్శ విషయంలో డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి మార్గదర్శకులు; వారి 'కవిత్వతత్త్వ విచారము' ప్రామాణికమైన రచన. అంతేకాదు, రామలింగారెడ్డి ఆంధ్ర - ఆంగ్ల భాషలలో గొప్పవక్తలు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, చెలకువాడ నరసింహం పంతులు కూడా తెలుగులో గొప్ప వక్తలు.

క్రీ.శ. 19వ శతాబ్ది చతుర్థపాదంలో తెలుగుసాహిత్య ప్రపంచంలో పరిశోధనకు శ్రీకారం చుట్టిన వారు మానవల్లి

రామకృష్ణకవి. వీరు 'ఎమ్.ఆర్. కవి' అన్న ప్రసిద్ధనామంతో అంతర్జాతీయ ఖ్యాతిని గడించుకొన్నారు.

## సంగీతం

కర్ణాటక, హిందుస్థానీ సంప్రదాయాలుగా చీలిపోయి నప్పటికీ భారతీయసంగీతం ప్రధానంగా ఒకటే. ప్రాచీన మహర్షులైన భరత, నారద, మతంగాదులు భారతీయ సంగీతానికి శాస్త్రాదులు రచించి, సువ్యవస్థితం చేశారు. ఈ శాస్త్రాలన్నింటిలో భరతుని 'నాట్యశాస్త్రం' సంగీత, నృత్య, నాటకాల విషయంలో ప్రామాణికమైన రచన. కాకతీయ గణపతిదేవుని సేనాపతి అయిన జాయపసేనాని సంగీత నృత్యాలలో విద్వాంసుడై సంగీత రత్నావళి, నృత్య రత్నావళి అనే శాస్త్రగ్రంథాలను రచించాడు. దేవగిరి రాజైన సింఘణభూపాలుని ఆస్థాన సంగీత విద్వాంసుడు శార్ఙ్గదేవుడు 'సంగీత రత్నాకరము' అనే ప్రామాణిక శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. ముస్లింలు భారత దేశాన్ని జయించిన పిమ్మట ఉత్తర భారతంలోని సంగీతం ఇస్లాం ప్రభావానికిలోనై దక్షిణ భారత శైలికి భిన్నంగా చాలా మార్పులకు లోనైనది.

క్రీ.శ. 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులు, ఆయన కుమారులు, మనుమలు వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ పెక్కు 'పదాలు' రచించారు. క్రీ.శ. 17 వ శతాబ్దిలో క్షేత్రయ్య సంగీత శాస్త్ర సమ్మతంగా పదరచన సాగించి, శృంగార రసానికి కళాత్మకంగా పరిపూర్ణత్వం కల్పించాడు. క్రీ.శ. 19 వ శతాబ్ది ఆరంభంలో

త్యాగరాజు తెలుగులో వాగ్గేయకారుడై, అద్వితీయమైన విధంగా కృతులను రచించి, పాడి, కర్ణాటక సంగీతాన్ని తీర్చిదిద్దినాడు. ఆయన సంగీతాన్ని 'నాదబ్రహ్మ' రూపంగా ఉపాసించినాడు. రామునియందు ఆయనకుగల పరమభక్తి సాటిలేనిది. సంగీతంద్వారా ఆయన ఆత్మ సిద్ధిని పొందాడు. శ్యామాశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్, త్యాగరాజు—ఈ మువ్వురు కర్ణాటక సంగీతానికి ప్రఖ్యాత త్రిమూర్తులు.

ఆధునిక కాలంలో సంగీతానికి తమిళ దేశంలో ఉన్నంత ప్రజాదరణ ఆంధ్ర దేశంలో లేకపోయినప్పటికీ ఉపేక్షింపబడలేదని మాత్రం చెప్పవచ్చు. విజయనగరం మహారాజా ఆనందగజపతి సంగీతాన్ని అభిమానించి, ఒక ప్రత్యేక సంగీత కళాశాలను స్థాపించారు. ఆ కళాశాలాధ్యక్షులుగా పనిచేసిన విజయనగరం నివాసి ఆదిభట్ల నారాయణదాసు కవి, వాగ్గేయకారుడు, హరికథా ప్రవీణుడు. పిఠాపురం నివాసి అయిన తూమరాడ సంగమేశ్వరశాస్త్రి, విజయనగరం నివాసి అయిన వీణ రామయ్యా గొప్ప వైణికులు. సజీవులైనవారిలో ఈమని శంకరశాస్త్రి ప్రఖ్యాత వైణికులు. ఇటీవలనే పరమపదించిన పద్మశ్రీ ద్వారం వేంకటస్వామి నాయుడు కర్ణాటక సంగీతంలో, ఫిడేలు వాద్యంలో అగ్రగణ్యులు. 'ఫిడేలు నాయుడు' అన్న పేర ఆయన సుప్రసిద్ధులు. ఆయన తొలి ఆంధ్రప్రదేశ్ ఆస్థాన సంగీత విద్వాంస పదవిని అలంకరించారు.

బాలమురళీకృష్ణ, నేదునూరి కృష్ణమూర్తి, సోమేశ్వర రావు, వాసా కృష్ణమూర్తి, వోలేటి వేంకటేశ్వర్లు, శ్రీమతి

టి. టి. సీత, శ్రీమతి శ్రీరంగం గోపాలరత్నం ప్రభృతులు కర్ణాటక సంగీతంలో సుప్రసిద్ధులు. డాక్టరు శ్రీపాద పినాక పాణి గాయకులే కాక సంగీత శాస్త్రజ్ఞులు. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గాయకులే కాక సంగీతశాస్త్ర విద్వాంసులు. హైదరాబాదులో హిందుస్థానీ సంగీత గాయకులు పలువు రున్నారు. ఈ చిన్నవ్యాసంలో వారందరిని గూర్చి పేర్కొనటం సాధ్యంకాదు. హైదరాబాదులోని ప్రభుత్వ సంగీత నృత్యకళాశాలలో కర్ణాటక-హిందుస్థానీ సంగీత సంప్రదాయాలు రెండింటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోంది.

## నృత్యం

ఆంధ్రదేశంలో యక్ష గానాలకు, లేదా నృత్య నాటకాలకు ప్రజాసామాన్యంలో చాలా ఆదరణ ఉండేది. ఇవి ప్రాచీన కాలంలో శ్రీశైలం, అహోబిలం మున్నగు దేవాలయాలకు చెందిన ఆటవిక జాతులవారిచేత ఆడబడేవి. 'అభినయ దర్పణం', 'భరతార్ణవం' రచించిన నందికేశ్వరుడు ఆంధ్రుడని తలంపబడుచున్నాడు. జాయపసేనాని నృత్త రత్నావళినిగూర్చి ఇంతకుముందే పేర్కొన్నాను. క్రీ.శ. 13వ శతాబ్ది ప్రాంతాలలో, సిద్ధేంద్రయోగి గురుత్వంలో, కృష్ణా జిల్లాలోని కూచిపూడి బ్రాహ్మణులు భామాకలాప నృత్యాన్ని వృత్తిగా స్వీకరించారు. అటుపిమ్మట నృత్య నాటక ప్రదర్శనాలు కూడ అభ్యసించారు. సిద్ధేంద్రయోగి గొప్ప గాయకుడు; నర్తకుడు. ఆయన ప్రభావం వల్లనే కూచిపూడి గ్రామ బ్రాహ్మణులంతా ఈనాడు కూడా ఈ

భామాకలాపాన్ని అభ్యసిస్తున్నారు; వారి పేరుమీదుగా ఈ నృత్యం 'కూచిపూడి భామాకలాపం' అని పిలువబడుతోంది. ఈ భామాకలాపం అభినయ విద్యకు నికషోపలం అంటే అతిశయోక్తికాదు.

ఈ కూచిపూడి నర్తకులు కొందరు తొలుత విజయనగర చక్రవర్తుల గౌరవాదరాలను పొంది, ఆ సామ్రాజ్య పతనానంతరం తంజావూరు రాజ్యానికి తరలివెళ్ళి, అచ్చట నాయకరాజుల ఆదరాభిమానాలకు పాత్రులయ్యారు. కూచిపూడి నర్తకుల భామాకలాపం నేటి తంజావూరు భరత నాట్యానికి, కూచిపూడి నర్తకుల నృత్యనాటకాలు నేటి మేలట్టూరులోని నృత్యనాటకాలకు మార్గదర్శకాలైనాయి. మహారాజ శరభోజీ (క్రీ. శ. 1798-1832) ఆస్థాన నృత్య విద్వాంసులైన చిన్నయ, పొన్నయ, వడివేలు, శివానందం అనే ప్రఖ్యాత సోదరులు భామాకలాపంలోని, రాజనర్తకీ దేవదాసీ సంప్రదాయాల లోని సారాన్ని గ్రహించి, నేడు తంజావూరు 'భరతనాట్యం' అని పిలువబడే నృత్య విధానాన్ని రూపొందించారు. "కూచిపూడి నృత్యం ప్రధానంగా పురుషుల నృత్యం; తంజావూరు భరతనాట్యం ప్రధానంగా స్త్రీల నృత్యం. ఈ రెండువిధాలైన నృత్యాలు ఒకే మూలంనుంచి ఉద్భవించాయి. రెండింటికి అభినయ దర్పణం, భరతార్ణవం, రసమంజరి అనేవి ప్రామాణిక శాస్త్రగ్రంథాలు."

—పోఱంగి శ్రీరామ అప్పారావు

నేటికీ కూచిపూడి నృత్యం ప్రసిద్ధిలో ఉంది. వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి ఆధునికులలో ప్రామాణికులైన గురువులు; ఆయన కొలదికాలం క్రిందటనే పరమపదించారు. నేడు కూచిపూడినృత్యవిద్యావేత్తలలో సుప్రసిద్ధులైనవారు— భరత కళాప్రపూర్ణ వేదాంతం రాఘవయ్య, వేదాంతం సత్యనారాయణశర్మ, చింతా కృష్ణమూర్తి, వెంపటి సత్యం, భాగవతుల రామకోటయ్య ప్రభృతులు. తదితర నృత్యసంప్రదాయాలలోను, జానపద నృత్యాలలోను సుప్రసిద్ధులైనవారు కొంతమంది ఉన్నారు. నటరాజ రామకృష్ణ నృత్యసంప్రదాయాలన్నీ తెలిసినవారు; అంతేకాదు, సమర్థులైన గురువులు. సంపత్కుమార్ జానపద నృత్యాలలో కృషి చేశారు. కోరాడ నరసింహారావు విదేశాలలో కూచిపూడి నృత్యాలను ప్రదర్శించి, పేరుపొందారు. కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, శ్రీరంగం శ్రీనివాసరావు ప్రభృతుల భావగీతాలను నృత్యానికి అనుగుణంగా మలచటంలో బి. వి. నరసింహారావు మార్గదర్శకులు. కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ నృత్యసంప్రదాయాలలో కుమారి యామినీ కృష్ణమూర్తి ప్రసిద్ధి పొందారు. యువతరం వారిలో కనకదుర్గ, జయశ్రీ, సుమతీ కౌశల్, విజయలక్ష్మి వర్ధిష్ణువులైన నర్తకీమణులు. కూచిపూడి, భరతనాట్య సంప్రదాయాలు రెండింటికి నేడు ప్రజాదరణ అధికంగా ఉంది. అందుచేత ఈ నృత్యాలు నేర్చుకొనటానికి పలువురు బాలికలు ముందుకు వస్తున్నారు; తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు.

## నాటకం

సాహిత్య శాఖలన్నింటిలోను నాటకం ఉత్తమోత్తమమైనప్పటికీ, సంస్కృత సాహిత్యంలో నాటకానికి ఉన్నత స్థానం ఉన్నప్పటికీ ('నాటకాంతం సాహిత్యం') ఇంతకుముందు పేర్కొన్న యక్షగానాలను తప్ప ప్రాచీనులైన కవులెవ్వరూ తెలుగులో నాటకాలు రచింపలేదు. ఈ ప్రాచీన కవులందరకు కాళిదాసాదుల నాటకాలు సుపరిచితాలే; అయినప్పటికీ క్రీ. శ. 19వ శతాబ్ది 7వ దశాబ్దంవరకు తెలుగులో నాటకరచనకు వారెవ్వరూ పూనుకోలేదు. ఇందలి రహస్యం ఇంకా అగోచరంగానే ఉంది. ఆధునికాంధ్ర నాటక రచనా ప్రదర్శనాలకు కందుకూరి వీరేశలింగం పంతులు (క్రీ. శ. 1848-1915) మార్గదర్శకులు. అంతకుముందే ఇద్దరు ముగ్గురు తెలుగు నాటక రచనకు పూనుకొన్నప్పటికీ అవి ప్రదర్శన భాగ్యానికి నోచుకోలేదు. ఈస్టు ఇండియా కంపెనీ అధికార్లు భారత దేశంలో పాదుకొల్పిన 18వ శతాబ్ది ఆంగ్ల నాటక రంగస్థల సంప్రదాయాన్ని అనుసరించి, మహారాష్ట్ర, కర్ణాటక నాటకసంఘాలవారు క్రీ. శ. 1880 ప్రాంతాలలో తెలుగు దేశంలో నాటక ప్రదర్శనాలిచ్చారు. వారు నిర్మించిన రంగస్థలాన్ని, నాటకశాలను తొందరలో వ్రాసి, ప్రదర్శింపజేసిన తమ నాటకాలకు వీరేశలింగం పంతులు ఉపయోగించారు.

'ఆంధ్ర నాటక పితామహులు' ధర్మవరం కృష్ణమాచార్యులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం,

వేదం వేంకటరాయశాస్త్రి, కోలాచలం శ్రీనివాసరావు, తిరుపతి వేంకటకవులు ప్రభృతులు అధికభాగం పౌరాణిక, చారిత్రక నాటకాలు రచించారు. ఇవి అన్నీ విజయవంతంగా ప్రదర్శింపబడ్డాయి. క్రీ. శ. 19 వ శతాబ్ది చివరి భాగంలో, వ్యావహారిక భాషలో రచింపబడిన ప్రఖ్యాత స్వతంత్ర సాంఘిక నాటకం గురజాడ వేంకట అప్పారావు రచించిన 'కన్యాశుల్కం'. శుల్కం పుచ్చుకొని, బాలికలను (కన్యలను) 50, 60 ఏండ్ల వృద్ధులకు భార్యలుగా అమ్మటం, వారు రజస్వలలు కాకుండానే ఆ వృద్ధులు గతించి, ఆ కన్యలు విధవలు కావటం అనే దురాచారాన్ని చిత్రించిన నాటకమిది. తెలుగులోని సాంఘిక నాటకాలకు ఇది తలమానికం అని చెప్పవచ్చు. క్రీ. శ. 20 వ శతాబ్దిలోని రెండవ దశాబ్దంలో ప్రసిద్ధికెక్కిన కొన్ని నాటక సంఘాలు— బెజవాడలోని మైలవరం కంపెనీ, ఏలూరులోని మోతే కంపెనీ, రాజమండ్రిలోని గున్నేశ్వరరావు కంపెనీ, బందరులోని డి. వి. సుబ్బారావు కంపెనీ. గుంటూరు, తెనాలి మున్నగు పట్టణాలలో కూడా ప్రసిద్ధాలైన వృత్తి నాటక సంఘాలు ఉండేవి.

తెలుగు నాటకరంగ చరిత్రలో విశిష్టంగా పేర్కొనదగిన అంశాలలో 'సురభివంశం' ఒకటి. ఈ వంశంలో స్త్రీ పురుషులందరూ నటన వృత్తిగా స్వీకరిస్తారు. ఈ వంశంవారు బహుళంగా వృద్ధిపొంది, ఇప్పుడు ముప్పదికి పైగా నాటక సమాజాలను నడపుతున్నారు. వేర్వేరు సమాజాలను స్వతంత్రంగా నడపుకొంటున్నప్పటికీ వీరందరు ఒక సమాఖ్యగా ఏర్పడినారు. అవేటి నాగేశ్వరరావు ఈ

సమాఖ్యకు నాయకుడు; ఆయన స్వయంగా ఒక సురభి నాటక సమాజాన్ని నిర్వహిస్తున్నారు.

కోలాహలపూర్వకమైన నటనా విధానాన్ని తిరస్కరించి, సాత్త్వికాభినయానికి ప్రాధాన్యమిచ్చి బళ్ళారి రాఘవాచార్యులు ('రాఘవ' అనేది ప్రసిద్ధనామం) క్రీ. శ. 1930 ప్రాంతాలలో రంగస్థల నటనంలో విప్లవం తీసికొనివచ్చారు. ఆయన తెలుగు నాటకరంగానికి చేసినసేవ మరి ఏ ఒక్కరూ చేసిఉండలేదు. నాడు ఆంధ్ర నాటకరంగం చాలా ఉత్సాహంతో పనిచేసింది. మంచి నాటకాలు ప్రయోగింపబడసాగాయి. యువతరంవారు క్రొత్త పంథాలో రచింపబడే ఆంగ్ల నాటకాలు పరిశీలించారు. మద్రాసు హైకోర్టు ప్రసిద్ధ మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన పి. వి. రాజమన్నారు తమ 'తప్పెవరిది' రచనతో తెలుగులో క్రొత్త నాటకరచనా విధానానికి నాంది పలికారు. ముద్దుకృష్ణ, నార్ల, ఆత్రేయ, నరసరాజు ప్రభృతులు కొందరు నాటక కర్తలుగా ప్రసిద్ధిపొందారు. ఆంధ్రదేశంలో నేడు బాగా ప్రచారంలో ఉన్న ఏకాంకికా నాటకరచనకు నార్ల మార్గదర్శకులు. యువతరంవారు నేడు ఆంగ్ల నాటకాలను అనుసరించటమేకాక, మంచి స్వతంత్ర నాటకాలను కూడ రచిస్తున్నారు. ఒకప్పుడు వృత్తి నాటకరంగం బాగా ప్రజాదరణ పొందింది. కాని సినిమా రాకవల్ల అది బాగా దెబ్బతిన్నది. తెలుగు నాటక రంగం పునర్వికాసం పొందితేనేకాని తెలుగులో ఉత్తమ నాటకాలు వెలువడవు.

క్రీ. శ. 1929 లో స్థాపింపబడిన 'ఆంధ్ర నాటక కళాపరిషత్తు' ఆధ్వర్యంలో ఔత్సాహిక నాటకరంగం అపారంగా అభివృద్ధి పొందింది. 'ది పీపుల్స్ థియేటర్', హైదరాబాదులోని 'నాట్యసంఘం', కొప్పరపు సుబ్బారావు స్థాపించిన 'లిటిల్ థియేటర్' మొదలైనవి ఔత్సాహిక నాటకరంగ సంస్థలే. ఆంధ్ర నాటకరంగంమీద సుప్రసిద్ధులైన నటులు ఎందరో ఉన్నారు—దుష్యంతుడుగా యడవల్లి సూర్యనారాయణ, హరిశ్చంద్రుడుగా హరిప్రసాదరావు, దుర్యోధనుడుగా మాధవపెద్ది వేంకట్రామయ్య, హరిశ్చంద్రుడుగా డి. వి. సుబ్బారావు, కృష్ణుడుగా బందా కనకలింగేశ్వరరావు, అర్జునుడుగా పులిపాటి వేంకటేశ్వర్లు, అనేక ముఖ్య పాత్రధారులుగా పీసపాటి, సూరిబాబు, రాఘవలు, స్త్రీ వేషధారులుగా ముప్పిడి జగ్గరాజు, పద్మశ్రీ స్థానం నరసింహారావు సుప్రసిద్ధులైనారు. వీరేకాక ప్రసిద్ధ నటులు ఇంకా చాలా మంది ఉన్నారు. నటీమణులలో శ్రీమతి పూర్ణిమ, శ్రీమతి రాజేశ్వరి వృత్తి నాటకరంగం మీద సుప్రసిద్ధులైనారు.

## సినీమా

ఆధునిక కాలంలో రంగస్థలానికి సహజశాఖగా వృద్ధి పొందింది సినీమారంగం. ఇది ప్రజల అభిమానం బాగా చూరగొన్న వినోదం మాత్రమే కాక గొప్ప వర్తక వ్యాపారం కూడాను. క్రీ. శ. 1931 ప్రాంతాలలో తెలుగు 'టాకీ'ల నిర్మాణానికి ఆరంభం జరిగినప్పటినుంచి నేటివరకు మంచి చిత్రాలు అనేకం వచ్చాయి. ఈ రంగంలో మంచి

నటీనటులున్నారు. సినీమారంగంతో నాకంటె అధికంగా పరిచయంగల వ్యక్తు లింకొక రెవ్వరైనా ఈ విషయాన్ని గూర్చి సవిస్తరంగా వ్రాయగలరని ఆశిస్తున్నాను.

## విగ్రహశిల్పం

చిత్రలేఖనం, విగ్రహశిల్పం, వాస్తుకళ—వీటిల్లో ఆంధ్రుల దెప్పుడూ ప్రముఖ స్థానమే. ఆంధ్రుల చరిత్రను వివరించే సమయంలో ఆంధ్రుల వాస్తుకళను గూర్చి సంక్షిప్తంగా వివరించి ఉన్నాను. భారతీయ సంప్రదాయంలోనే కాక ఆంధ్రసంప్రదాయంలో కూడా విగ్రహ శిల్పానికి, వాస్తుకళకు సన్నిహిత సంబంధం ఉంది. రాతి దేవాలయాలలో శిల్పాలు మలచటం జరిగింది. మెత్తని రాళ్ళమీద శిల్పాలు చెక్కి బౌద్ధ స్తూపాలకు చుట్టూ అమర్చే వారు. దేవాలయ గోపురాలు కూడా శిల్పాలకు చక్కని అవకాశం కల్పించాయి. విజయనగరసామ్రాజ్యంనాటి రాజభవనాలలోను, పెద్ద పెద్ద శాలలలోను శిల్ప విన్యాసాలు కన్పట్టగలవు. ఆంధ్రుల చరిత్రలోని సాతవాహన, ఇక్ష్వాకు, విష్ణుకుండి, పల్లవ, చాళుక్య, కాకతీయ, విజయనగర రాజుల కాలాల్లో వాస్తు కళతోపాటు విగ్రహశిల్పం కూడా అభివృద్ధి పొందింది. లభించిన విధంగా భద్రపరుపబడిన ఈ శిల్పాలన్నింటిని ఆయా ప్రాంతాలలోకాని, పురావస్తు ప్రదర్శనశాలల్లో కాని నేటికిని చూడవచ్చు. భారతీయ ప్రభుత్వమేకాక ఆంధ్రప్రభుత్వం కూడా ఈ పురాతన కట్టడాలను భద్రపరచడానికి చాలా జాగ్రత్త తీసికొంటున్నది.

అమరావతి, నాగార్జునకొండ స్తూపాలచుట్టూ చలువ రాళ్ళలో మలచబడిన జాతక కథల శిల్పాలే మనకు లభించిన తొలిశిల్పాలు. గౌతమబుద్ధుని వివిధ జన్మలకు సంబంధించిన కథలను కళాత్మకంగా, విశదంగా ఈ శిల్పాలు నిరూపిస్తున్నాయి. ఆ విగ్రహాల ముఖభావాలు, కదలికలు, వివిధ అంగవిన్యాసాలు సజీవ వ్యక్తులవలెనే బుద్ధుని ఆశయాలను, కథలను, బోధలను వ్యక్తం చేస్తున్నాయి. సాంచిలోని ప్రసిద్ధ తోరణం, మహాబలిపురంలోని అర్జున తపస్సు, లేపాక్షిలోని మహానంది, రామప్ప గుడిలోని నృత్యభంగిమలు, హంపిలోని నృసింహమూర్తి—ఇవి ఆంధ్రుల ప్రసిద్ధ శిల్పాలలోని కొన్ని మాత్రమే. ప్రాచీన సంప్రదాయానికి చెందిన కొలదిమంది శిల్పులు మాత్రం నేటికీ మినుకు మినుకుమంటూ జీవించి ఉన్నప్పటికీ బౌద్ధ హైందవ శిల్ప సంప్రదాయాలు నశించి పోయాయనే చెప్పవచ్చు; ఇది మన దురదృష్టం. ఈ విధంగా ఈ కళను నశించి పోనీయరాదు.

శిల్పాలు అంటే, పాశ్చాత్య మతం ప్రకారం, వ్యక్తుల విగ్రహాలు లేదా సామూహిక చిత్రణం. ఈ ఆధునిక శిల్పం కూడా నేటి ఆంధ్రులలో ప్రచారం పొందలేదు. యువతరానికి చెందిన వర్ధిష్ణువులైన శిల్పులు కొందరు ఇప్పుడిప్పుడు అభివృద్ధిపథంలో ప్రయాణిస్తున్నారు. కాని దేవీప్రసాద్ చౌదరివలె ప్రఖ్యాతి పొందినవారు ఆంధ్రులలో ఇంకా [illegible] లేరు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉస్మాన్ సిద్దికీ మంచి [illegible].

దక్కను [illegible] ముస్లిం పరిపాలన ఆరంభమైన పిమ్మట వాస్తుకళ వికసించిందని చెప్పవచ్చు. కుతుబ్‌షాహీల పరి

V. R. NARLA MEMORIAL LIBRARY
V. R. NARLA D. P. R. I. Acc. No.

పాలనలో గోల్కొండలోను, అసఫ్ జాహీల పరిపాలనలో హైదరాబాదులోను వాస్తుకళ వికాసం పొందింది. నాటి నిర్మాణాలైన చార్‌మినార్, మక్కామసీదు, కుతుబ్ షాహీల గోరీలు మున్నగునవి నేటికీ భద్రంగా కాపాడ బడటం మనం చూస్తున్నాము. ఆంధ్రలో, వాస్తుకళా విషయంలో, బ్రిటిషువారు ఎట్టి కృషి చేయలేదు. పబ్లిక్ వర్క్స్ శాఖద్వారా బ్రిటిషు ప్రభుత్వం కొనసాగించిన వాస్తు నిర్మాణ శైలియే దురదృష్టవశాత్తు ఇప్పటికీ కొన సాగుతూ ఉంది. పాశ్చాత్య శిల్పుల, వారి శిష్యుల ప్రభావం వల్ల ఈ పరిస్థితిలో క్రమంగా మార్పువస్తోంది. న్యూ ఢిల్లీ, చండీఘర్ లలోని నూత్న నిర్మాణాలను, దేశంలోని ముఖ్య పట్టణాలలోని కొందరు వ్యక్తుల సొంతభవనాలను చూస్తే ఈ విషయం స్పష్టం కాగలదు. ఉస్మానియా విశ్వవిద్యాల యాన్ని నిర్మించిన నవాబ్ అలీ నవాబ్‌జంగ్ ప్రసిద్ధవాస్తు శిల్పి. ఇటీవల ప్రభుత్వవాస్తుశిల్పి పదవీవిరమణచేసిన ఫైజుద్దీన్ హైదరాబాదులోని రవీంద్రభారతీ నిర్మాణాన్ని రూపొందించారు. ఆంధ్రుల జాతీయ నాటకశాల అయిన ఈ 'రవీంద్ర భారతి' హైదరాబాదులో ఇటీవల నిర్మింపబడిన వాస్తు కళాత్మకమైన కట్టడం.

నేడు పలువురు యువకులు వాస్తుకళలో శిక్షణ పొందుచుండుట సంతోషకరమైన విషయం. హైదరాబాదు లోని 'ఆర్టుస్కూలు' లో ముప్పది మందికి పైగా బాలికలు వాస్తుకళ నేర్చుకొంటున్నారు.

## చిత్రలేఖనం

చిత్రలేఖన కళలో ఆంధ్రులు రమణీయమైన కృషిచేశారు. సాటిలేని సౌందర్యంతో కూడుకొన్న అజంతా బౌద్ధచిత్రాలు ప్రాచీనశిల్ప శాస్త్రసమ్మతంగా కడుసమర్థతతో చిత్రింపబడినాయి. అజంతా, బాగ్, సిత్తన్‌వాసల్, సిగీరియాలలోని 'ఫ్రెస్కో' చిత్రాలకు కళాత్మకంగా సన్నిహిత సంబంధం ఉంది. అజంతా చిత్రాలు సాతవాహన, వాకాటక, బాదామి చాళుక్యుల కాలాల్లో చిత్రింపబడ్డాయి. తరువాతికాలంలో కూడా చిత్రలేఖనకళ బాగా కొనసాగుతూనే వచ్చింది. "జినకంజీవరంలోని వర్ధమాన దేవాలయమందలి జైనచిత్రాలు రెండవ హరిహర రాయల కాలానికి (క్రీ. శ. 1377-1404) చెందినవి. ఆనెగొంది వీచయప్పచిత్రాలు, హంపీ విరూపాక్షాలయం లోని చిత్రాలు క్రీ. శ. 15 వ శతాబ్దికి చెందుతాయి. కంజీవరం వరదరాజస్వామి ఆలయచిత్రాలు క్రీ. శ. 1529 ప్రాంతంలో చిత్రింపబడ్డాయి."

—*తెలుగు విజ్ఞాన సర్వస్వం*

కాగా, ఆంధ్రదేశంలో హిందూపరిపాలనలో 'ఫ్రెస్కో' చిత్రాల సంప్రదాయం నిరంతరంగా సాగింది. గోల్కొండలో ఇస్లాంరాజ్యం ఏర్పడినపిమ్మట ఆంధ్ర చిత్రకారులు మొగల్ శైలి చిత్రలేఖనం చేపట్టారు. ఈ శైలి, అత్యంత మనోహరమైన 'దక్కన్ స్కూల్ ఆఫ్ మీనియేచర్ పెయింటింగ్' గా అభివృద్ధి పొందింది. బ్రిటిష్‌వారి పాలనలో ఆంధ్రదేశంలో చిత్రలేఖన కళకుకూడా ఎట్టి దోహదం కలుగ

లేదు. బెంగాలులో అవనీంద్రనాథటాగూర్ స్థాపించిన వంగసంప్రదాయపు ప్రభావం పడేవరకు ఆంధ్రదేశంలో చెప్పుకొనతగిన కృషి ఏమీ జరుగలేదు.

ఆధునిక కాలంలో ఆంధ్ర చిత్రలేఖనానికి మార్గదర్శకులు దామెర్ల రామారావు, అడివి బాపిరాజు. రామారావు బొంబాయి కళాశాలలో శిక్షణపొందారు. ఆయన అజంతా చిత్రాలనుండి ఉత్సాహంపొంది, స్వీయ ప్రతిభకు తగిన ఒక క్రొత్తశైలిని రూపొందించుకొన్నారు. ఆయన చిత్రాలలోని రేఖావిన్యాసం, సమీకరణంలోని చిత్రణంలోని పొందిక, వర్ణసారళ్యం చాలా గణనీయాలు, గుణాధికాలు. బాపిరాజు ఎంత గొప్పచిత్రకారుడో అంతగొప్ప కవి, నవలాకారుడు, పత్రికారచయిత. నా దృష్టిలో అయితే బాపిరాజు ప్రప్రథమంగా కాల్పనికోద్యమానికి చెందిన ఉత్తమ కళాకారుడు. వంగసంప్రదాయానికి చెందిన ప్రమోద్‌కుమార్ ఛటర్జీనుండి ఉత్సాహం, ఆయనకడ శిక్షణపొందారు బాపిరాజు. బాపిరాజు చిత్రాలన్నీ ప్రత్యేకమైన స్వీయముద్ర కలవి. ఆయన రేఖావిన్యాసంలో కోమలత్వం, భావప్రకటన సామర్థ్యం, క్రియాత్మకశక్తి ఉన్నాయి. కాని, ఆయన బహుముఖ ప్రజ్ఞ కలవాడై, అనేక వ్యాసంగాలలో అభిరుచి కలవాడై ఉండటంవల్ల ఎక్కువ చిత్రాలను రచింపక పోవటం మన దురదృష్టం.

చామకూర్, నాగేశ్వరరావులు వ్యక్తిచిత్రణంలో సిద్ధహస్తులు. రామమోహనశాస్త్రి తైలవర్ణ, జలవర్ణ చిత్రలేఖనాలు రెండింటిలోను సిద్ధహస్తులు. బహుశా ఇంగ్లండులో శిక్షణపొందిన తొలిఆంధ్ర చిత్రకారుడు ఈయనే.

భాగీరథి జానపద చిత్రణంలో ప్రసిద్ధులు. హైదరాబాదులో ఖాన్‌బహదూర్ సయీద్ అహ్మద్, జలాలుద్దీన్‌లు ప్రసిద్ధ చిత్రకారులు. అజంతా చిత్రాలను యథాతథంగా చిత్రించటం మూలంగా వారు చిత్రలేఖన కళకు అమూల్యమైన సేవచేశారు. యువతరంవారిలో పైడిరాజు, హెచ్. వి. రామగోపాల్, మొక్కపాటి శ్రీనివాసులు, పి. టి. రెడ్డి, ఎస్. వి. రామారావు, రెడ్డప్పనాయుడు, మధుసూదన్, జగదీశ్ మిత్తల్, శ్రీ రావు, శ్రీమతి కరుణారావు, కుమారిల స్వామి, సయీద్ మాసూద్ అహ్మద్, మడిపడగ బలరామాచార్య, కుమారి ఫాతిమా అహ్మద్‌లు ముఖ్యంగా పేర్కొనదగ్గవారు. వర్ధిష్ణువులైన చిత్రకారులు ఇంకా ఎంతమందో ఉన్నారు. హైదరాబాదులో శక్తిమంతులైన చిత్రకారులు, యువతీయువకులు, పలువురున్నారు. ఆంధ్ర చిత్రకారులు ప్రాచీన, నవీన సంప్రదాయాలు రెండింటిని ఆదరిస్తారు. వారు ఉత్సాహవంతులేకాక నిజమైన కళోపాసకులు. త్వరలోనే భారతీయ చిత్రకళకు గొప్ప విశిష్టతను చేకూర్చగల చిత్రకారులు ఆంధ్రప్రదేశ్‌లో వెలయగలరని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను.

## చేతిపనులు

ఆంధ్రప్రదేశ్‌లో అందమైన వస్తువులు కొన్ని సంప్రదాయసిద్ధంగా చేతిపనుల ద్వారా తయారు అవుతున్నాయి. కళాభిమానులందరు తప్పక సంపాదించి భద్రపరచుకోవలసిన వస్తువులివి. బిద్రీ వస్తువులు, నిర్మల్ వస్తువులు, దంతంతో కొమ్ముతో తయారు చేయబడిన వస్తువులు, వెండినగిషీ

వస్తువులు, కొండపల్లి బొమ్మలు, తిరుపతి ఎఱ్ఱచందనం బొమ్మలు, చర్మ వస్తువులు, తివాసీలు, దుప్పట్లు, చాపలు, పేము వస్తువులు—ఇవి అన్నీ చేతిపనులవల్ల తయారవుతున్న వస్తువులే. ఆంధ్రప్రదేశ్ చేనేత వస్త్రాలకు కూడా ప్రసిద్ధి కెక్కింది. గద్వాల్, సిద్దిపేట, పోచంపల్లి, ఉప్పాడ, వెంకటగిరి చీరలు, ఆర్మూర్ సిల్కువస్త్రాలు, హిమురూ గద్వాల్ చోళ్ ఖాన్‌లు, పొందూరు సన్నబట్టలు, కలంకారీ అద్దకాలు—ఇవి అన్నీ హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విక్రయశాలలో లభిస్తున్నాయి.

## జానపద వినోదాలు

'జనపద'మంటే పల్లెటూరు. జనపదాలలో ఉండేవారు జానపదులు. ఈ జానపదుల వినోదాలలో నృత్య, సంగీత, నాటకాలేకాక ఇంకా అనేకం ఉన్నాయి—తోలుబొమ్మ లాటలు, కట్టెబొమ్మలాటలు, పగటివేషాలు, బుట్టబొమ్మలు, విప్రవినోదం, పులివేషాలు మొదలైనవి. తుమ్మెదపాటలు మొదలైనవి జానపద సంగీతానికి సంబంధించినవి. హరి కథలు, బుర్రకథలు, భజనలు, బతకమ్మపాట మొదలైనవి నృత్య సంగీతాలు రెండింటికీ చెందుతాయి. కురవంజి, యక్షగానం, వీధి భాగవతం నాటకానికి చెందుతాయి. ఇవేకాక పర్వత, అరణ్య ప్రాంతాలకు చెందిన చెంచులు, భిల్లులు, లంబాడీలు, కోయలు మున్నగువారి నృత్య వినోదాలు అనేకం ఉన్నాయి. ఈ జానపద వినోదాలకు ఉపయోగపడే గేయాలు నాగరక చిత్ర కల్పనలకు దూరమై, సుఖదుఃఖాలను స్వయంగా అనుభవించిన జానపదకవుల

హృదయాలనుండి సూటిగా వెలువడినవి ; ఇవి తెలుగులోని లలిత లేదా మధుర సాహిత్యానికి ప్రథమోదాహరణాలు. పండుగ పబ్బాల సమయాలల్లో, ఉత్సాహంతో స్త్రీ పురుషు లందరూ సామూహికంగా తమతమ ఆచార సంప్రదాయాల్ని అనుసరించి ఈ వినోదాల్లో పాల్గొంటారు.

ఈ వినోదాలు నేడు నశించిపోతున్నాయి. పోగా మిగిలినవాటికి నాగరకత ప్రభావం సోకి, వాటిలోని సహజ ప్రాకృతిక సౌందర్యం లోపిస్తోంది. వీటిని పునరుజ్జీవింప జేయటానికి కృషి జరగాలి. భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవంలో న్యూఢిల్లీలో అఖిల భారతీయ జానపద నృత్య సంగీతాలను ప్రదర్శింపజేస్తున్నారు. ఆ విధంగానే, ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్ర జానపద సంగీత నృత్యాదులను ప్రదర్శింపజేయవచ్చు.

## పరిశోధనలు

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట, అంతకంటె అధికంగా తొలుత ఆంధ్రరాష్ట్రం, తరువాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పిమ్మట తెలుగు దేశంలో వివిధ రంగాలలో పరిశోధనాసక్తి పెంపొందింది. రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలు ఇందులకు ఎంతగానో దోహదం చేశాయి ; చేస్తున్నాయి. తెలుగు సాహిత్యంలో, సంగీత నృత్య నాటకాది కళలలో పరిశోధనలు జరుగుతున్నాయి. పలువురు నన్నయ తిక్కనాది కవులపై, చరిత్రపై, చిత్రలేఖ నాదిలలితకళలపై, నవలలు నాటకాలు నవ్యకవితలపై, నృత్య

సంగీతాలపై, జానపద వినోదాలపై, చేతి పనులపై, చక్కని పరిశోధనలు కావించి, గ్రంథాలు రచిస్తున్నారు; డాక్టరేటు డిగ్రీలు పొందుతున్నారు. డిగ్రీ సంపాదనతో నిమిత్తం లేకుండా మరి కొందరు జిజ్ఞాసువులు స్వయంగా పరిశోధనలు సాగించి, ఫలితాలను గ్రంథరూపంలో అందిస్తున్నారు. భరతముని నాట్యశాస్త్రం సమగ్రానువాదం పొందింది తొలుత తెలుగు భాషలోనే. ఇట్టి పరిశోధనలన్నీ ప్రాచీన, నవీన సంప్రదాయాలు రెండింటికి మధ్య సేతువుగా నిల్చి, జాతి చైతన్యాన్ని జాగరితంచేస్తాయి. పై పరిశోధన గ్రంథాలలో ఇప్పటికి కొన్ని మాత్రమే ముద్రణ భాగ్యం పొందాయి. తక్కినవి కూడా ముద్రణభాగ్యం పొంది, ప్రజలందరికీ అందుబాటులోకి వచ్చినప్పుడు భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి అవి ఎంతగానో ఉపకరిస్తాయి.

## అకాడెమీలు

ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన పిమ్మట, సాంస్కృతిక పునర్వికాసం కలిగించాలన్న ఆశయంతో లలితకళలకు—సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, పురావస్తు సంచయం —వీటికి ప్రోత్సాహ సహకారాలివ్వటకోసం ప్రభుత్వం చేయగలిగినదంతా చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు సాహిత్య అకాడెమి, సంగీత నాటక అకాడెమి, లలితకళా అకాడెమి, పురావస్తు పరిశోధన శాఖ, జాతీయ నాటక శాల అయిన రవీంద్రభారతి ఉన్నాయి; మూడు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలు, రెండు ప్రైవేటు నాటక విద్యాలయాలు ఉన్నాయి. కూచిపూడి గ్రామంలో కూచిపూడి నృత్య శిక్షణకేంద్రం నెలకొల్పబడింది. హైదరా

బాదులో వాస్తుకళ లలితకళల ప్రభుత్వ కళాశాల ఉంది. రెండు పురావస్తు ప్రదర్శనశాలలు—ఒకటి హైదరాబాదులో, ఇంకొకటి విజయవాడలో - ఏర్పాటు చేయబడినాయి. ఇవికాక, హైదరాబాదులో సుప్రసిద్ధమైన 'సాలార్ జంగ్ మ్యూజియం' ఉంది.

అకాడెమీలన్నీ తమతమ రంగాలకు సంబంధించిన సంస్థలకు తగిన చేయూత నివ్వటానికీ, పరిశోధనలను ప్రోత్సహించటానికీ కృషిచేస్తున్నాయి. పేదవారైన వృద్ధ కళాకారులకు ఉచిత వేతనాలివ్వటం జరుగుతోంది. రవీంద్రభారతి నిర్మాణానికి పూర్వం ఆంధ్రప్రదేశ్ లో జాతీయ నాటకశాల లేదు. ఇప్పుడు ఆ కొరత తీరింది. ఇదేవిధంగా జిల్లా కేంద్రాలలో, మ్యునిసిపాలిటీలలో జాతీయనాటక శాలలు నిర్మించటానికి కృషిసాగుతోంది. క్రమంగా ఆంధ్రులు ఉన్నకొలది సాధనాలతో, అవకాశాలతో, ధైర్యంగా, దృఢసంకల్పంతో, ఆశతో, అమోఘమైన సాంస్కృతిక పునరుజ్జీవనం సాధించగలమన్న ఆత్మప్రత్యయంతో అభివృద్ధి పథంలో పురోగమిస్తున్నారు.

## కళల పరమార్థం

కళద్వారా పరిపూర్ణత్వం సాధించాలన్నదే పరమాశయం. మానవులు కళద్వారానే సౌందర్యాన్ని గ్రహించగలరు. సౌందర్యాన్ని గ్రహించి, అనుభవించటం ద్వారానే ఆనందం—అంటే సుఖ దుఃఖాతీతమైన, అపారమైన, నిశ్చలమైన శాంతి లభ్యమవుతుంది. అప్పుడే మానవుడు స్వయంభువుగా, ఆత్మజ్ఞానిగా, సత్యస్వరూపుడుగా అంటే—సత్, చిత్ స్వరూపుడుగా—వెలయగలడు.

ఆధార గ్రంథాలు :

1. కుందూరి ఈశ్వరదత్తు ఆంగ్లంలో ప్రకటించిన 'ఆంధ్ర సావనీర్' లోని క్రింది వ్యాసాలు :

(అ) నలభై ఏండ్ల అలజడి—భోగరాజు పట్టాభి సీతారామయ్య.

(ఆ) మన సంగీత సంప్రదాయం—బాలాంత్రపు రజనీకాంతరావు.

(ఇ) కూచిపూడి—పోణంగి శ్రీరామ అప్పారావు.

(ఈ) ఆంధ్ర చిత్రకారులు—అమంచర్ల గోపాలరావు.

(ఉ) గతచరిత్ర స్మరణ—మామిడిపూడి? మారేమండ రామారావు.

(ఊ) ఉత్తర దక్షిణ భారతదేశాలమధ్య సంబంధం—నిడుదవోలు వేంకటరావు.

(ఋ) తెలుగు సాహిత్యం : ప్రాచీనం, నవీనం—పాకాల వేంకట రాజమన్నారు.

(ౠ) ఆధునిక తెలుగు సాహిత్యం—బెజవాడ గోపాలరెడ్డి.

2. తెలుగు విజ్ఞాన సర్వస్వము.


3. ఆంధ్ర నాటక కళాపరిషత్ రజతోత్సవ సంచిక (తగుకు పరిషత్ సందర్భంగా ప్రకటితము).

4. తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం—దేవులపల్లి రామానుజరావు.

## జన్మభూమి

ఏదేశ మేఁగినా, ఎందుఁగాలిడిన
ఏపీఠ మెక్కినా, యెవరెదురయిన
పొగడరా! నీ తల్లి భూమి భారతిని
నిలుపరా! నీ జాతి నిండుగర్వమ్ము
లేదురా! ఇటువంటి భూదేవి యెందు
లేరురా! మనవంటి ధీరులింకెందు.
ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమొ,
జనియించినాడ వీ స్వర్గలోకమున.
ఏ మంచి పూవులన్ ప్రేమించినావొ
నిను మోచె, నీ తల్లి కనకగర్భమున.

—రాయప్రోలు సుబ్బారావు



అలంకరణ ఫలకం – నిర్మల్



ఏలూరు ఉన్ని తివాసీ



బిద్రీ కూజా.

51




చిత్రాంగి

పద్మశ్రీ స్థానం నరసింహారావు



ఉష — వేదాంతం సత్యనారాయణశర్మ



లేపాక్షి—పద్మినీజాతి స్త్రీ




త్యాగరాజు



పద్మశ్రీ ద్వారం వేంకటస్వామి నాయుడు



కొండపల్లి బొమ్మలు – దశావతారాలు




పోచంపల్లి చోళీ



ఏలూరు ఉన్నితివాసీ (రంగులలో)



నూలు దుప్పటిలు



బళ్ళారి రాఘవ

Bcl

AOUAC05B125
BC
NARLA MEMORIAL LIB
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B125 |
| పుస్తకం పేరు | ఆంధ్రుల సంస్కృతి చరిత్ర |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 65 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | Ci Bci |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Kethura |
| పేజీలు విడదీసినది | Kethera |
| స్కాన్ చేసినది | leja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |